

## ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపాలని జీఎంకు వినతి

ఓదెల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కొలనూర్ రైల్వేస్టేషన్‌లో పలు ఎక్స్‌ప్రెస్‌రైళ్ళకు హాల్టింగ్ ఇవ్వాలని మంగళవారం రైల్వే జీఎంకు సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు దండమరాజు రామచందర్ రావు మంగళ వారం సికింద్రాబాద్‌లో వినతి పత్రాన్ని అందించారు. కొలనూర్ రైల్వే స్టేషన్ లో సిర్పూర్ కాగజ్ నగర్ ఎక్స్‌ప్రెస్‌తో పాటు, కరీంనగర్ తిరుమల తిరుపతి ఎక్స్ ప్రెస్, అలాగే చంద్రాపూర్ అజ్నీ ప్యాసింజర్ రైలును హాల్టింగ్ చేయించాలని కోరారు.

## 5న కలెక్టరేట్‌లో మెగా జాబ్ మేళా

పెద్దపల్లి కల్చరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో ఈ నెల 5న నిర్వహించనున్న జాబ్‌మేళాను నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోయశ్రీహర్ష తెలిపారు. ఇందులో ఐటీ, ఐటీయేతర సుమారు 15 కంపెనీలు పాల్గొంటున్నాయన్నారు. డిగ్రీ, బీటెక్, పోస్ట్ గ్రాడ్యుయేషన్, ఐటీఐ డిప్లమా కోర్సులు చేసిన 18 నుంచి 35 ఏళ్ల లోపు వారు ఇంటర్వ్యూలకు హాజరు కావాలని ఆయన కోరారు. అభ్యర్థులు 3నుంచి4 సెట్ల బయోడేటాతో పాల్గొనాలని ఆయన సూచించారు.

## సీఐఎస్ఎఫ్ ఐజీ పర్యటన



ఐజీ శరవణన్‌కు స్వాగతం పలుకుతున్న సీనియర్ కమాండెంట్

జ్యోతినగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ దక్షిణ ఇన్‌స్పెక్టర్ జనరల్ శరవణన్ మంగళవారం రామగుండం ఎన్టీపీసీలో పర్యటించారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా ఎన్టీపీసీకి చేరుకున్న ఆయనకు రామగుండం యూనిట్ సీఐఎస్ఎఫ్ సీనియర్ కమాండెంట్ అరవింద్‌కుమార్, ఇతర అధికారులు స్వాగతం పలికారు. ఎన్టీపీసీ ప్రాజెక్టు పరిధిలోని సెక్యూరిటీ వ్యవస్థ, అగ్నిమాపక వ్యవస్థలపై సమీక్ష చేయనున్నట్లు వారు పేర్కొన్నారు.

## ప్రారంభం కాని ఇందిరమ్మ గృహాలు రద్దు


ఓదెల, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలో ఇప్పటి వరకు లబ్ధిదారులు నిర్మాణ పనులు ప్రారంభించని 241 ఇందిరమ్మ ఇండ్లను కలెక్టర్ రద్దు చేసినట్లు హౌజింగ్ ఏఈ వసంత తెలిపారు. మండలంలో పైలట్ గ్రామమైన శానగొండలో 218 గృహాలు మంజూరు కాగా 41 ఇండ్ల పనులు నిర్వహిస్తున్నారని, మిగతా 177 ఇండ్ల పనులు ప్రారంభించకపోవడంతో రద్దు చేశారని తెలిపారు. మిగతా 21 గ్రామాల్లో 468 ఇండ్లు మంజూరు కాగ, 64 ఇండ్లకు నిర్మాణ పనులు మొదలు పెట్టక పోవడంతో రద్దు చేశామని ఏఈ తెలిపారు. మొత్తం 241 ఇండ్లను రద్దు చేస్తూ జిల్లా కలెక్టర్‌కు ప్రపోజల్స్ పంపించామని, లబ్ధిదారులు దళారుల మాటలు నమ్మవద్దని, భవనం స్లాబ్ ఏరియా ఎనిమిది వందల నుంచి తొమ్మిది వందల చదరపు అడుగులకు మాత్రమే పరిమితం చేయాలన్నారు. ఇప్పటినుంచి వెయ్యి చదరపు అడుగులకు మించి చెల్లింపులు ఉండవని తెలిపారు. ఖర్చులు తగ్గించుకొని పనులను వెంటనే త్వరగా పూర్తి చేయాలన్నారు.

## రైతులకు వెంటనే చెల్లింపులు పూర్తి చేయాలి

ముత్తారం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ధాన్యం విక్రయించిన రైతుకు వెంటనే చెల్లింపులు పూర్తి చేయాలని ఏడీఏ అంజనీ దేవి సూచించారు. మంగళవారం రైతు వేదికలో ధాన్యం కొనుగోలు సొసైటీ, ఐకేపీ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లను త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలన్నారు. దిగుమతి చేయాల్సిన ధాన్యం వివరాలను తెలుసుకున్నారు. సన్నదొడ్డు రకాలను వేరువేరుగా సేకరించాలన్నారు. సన్న రకాలకు బోనస్ వచ్చేలా చూడాలని అన్నారు. ఏవో అనూష, ఏఈవోలు హారిక, అలేఖ్య, సొసైటీ సిబ్బంది శ్రీనివాస్, మల్లేష్, రామ్, రాధిక, తిరుపతి తదితరులున్నారు.

# పంచాయతీ నుంచే తొలి అడుగు

- స్థానిక సంస్థల నుంచి చట్టసభలకు ఎన్నికైన పలువురు నాయకులు
- సర్పంచ్, ఎంపీపీలు, జడ్పీటీసీలు, మున్సిపల్ కౌన్సిలర్లుగా అరంగేట్రం
- ఎమ్మెల్యేలుగా ఎన్నికైన పలువురు..
- పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో చర్చ



(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

ప్రజాసేవ చేసేందుకు రాజకీయాల్లోకి వచ్చే నాయకులకు స్థానిక సంస్థలు పెద్దపీట వేస్తాయి. స్వతంత్రంగా, వివిధ రాజకీయ పార్టీల ద్వారా అనేక మంది రాజకీయాల్లోకి వస్తారు. మొదట స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసి ప్రజా సేవకు సిద్ధం అవుతారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపొందే నాయకులు ప్రజల సంక్షేమం కోరుతూ, గ్రామాలు పట్టణాల అభివృద్ధి కోసం పాటుపడే వారికి ప్రజల ఆదరణ ఉంటుంది. స్థానిక సంస్థల్లో వరుసగా గెలుపొంది వివిధ పదవులను అలంకరించడమే కాకుండా చట్టసభలకు వెళ్లేందుకు కూడా పలువురు నాయకులకు అవకాశం దక్కింది. అలా పెద్దపల్లి జిల్లాకు చెందిన గీట్ల ముకుంద రెడ్డి, బిరుదు రాజమల్లు, గుజ్జుల రామకృష్ణారెడ్డి, చింతకుంట విజయరమణారావు, చంద్రుపట్ల రాంరెడ్డి, పుట్ట మధుకర్, సోమారపు సత్యనారాయణ, కోరుకంటి చందర్, కాసిపేట లింగయ్య, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో అడ్లూరి లక్ష్మణ్ కుమార్ రాష్ట్ర ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రిగా కొనసాగుతుండగా, చింతకుంట విజయ రమణారావు పెద్దపల్లి ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు.

### ● సర్పంచ్‌లుగా..

కాంగ్రెస్ పార్టీ ద్వారా రాజకీయాల్లోకి అడుగు పెట్టిన గీట్ల ముకుందరెడ్డి మొదట స్వగ్రామమైన కాల్వ శ్రీరాంపూర్ మండలం కూనారం సర్పంచ్‌గా 1975లో ఎన్నికయ్యారు. ఆ తర్వాత 1981లో పెద్దపల్లి సమితి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. తొలిసారిగా ఆయన 1989లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆ తర్వాత 1994లో పోటీ చేసినప్పటికీ ఓటమి చెందారు. మరోసారి 2004లో తెలంగాణ రాష్ట్ర సమితి నుంచి పోటీ చేసి విజయం సాధించారు.

● ధర్మారం మండలం కమ్మర్ ఖాన్ పేట గ్రామానికి చెందిన గుజ్జుల రామకృష్ణారెడ్డి బీజేపీ ద్వారా రాజకీయాల్లో అడుగు పెట్టారు. తొలిసారిగా ఆయన 1988లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆ వెంటనే మండల పరిషత్ ఉపాధ్యక్షుడిగా ఎన్నిక కావడం గమనార్హం. ఆ తర్వాత 1995లో జరిగిన మండల జిల్లా పరిషత్ ఎన్నికల్లో రామకృష్ణారెడ్డి ధర్మారం మండలం నుంచి జడ్పీటీసీగా పోటీ చేసి విజయం సాధించారు. ఆ తర్వాత 1999లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం, బీజేపీ పొత్తులో భాగంగా పెద్దపల్లి నియోజకవర్గం బీజేపీకి కేటాయించింది. దీంతో రామకృష్ణారెడ్డి జడ్పీటీసీ పదవికి రాజీనామా చేసి ఆ స్థానం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలు పొందారు. అనంతరం మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా పోటీ చేసినప్పటికీ గెలుపొందలేదు.

● సుల్తానాబాద్ కి చెందిన బిరుదు రాజమల్లు స్థానిక సంస్థల నుంచే చట్టసభలకు వెళ్లారు. ఆయన 1983లో ఎమ్మెల్యేగా పోటీ చేసినప్పటికీ గెలుపొందలేదు. అనంతరం 1985లో సుల్తానాబాద్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. 1988లో ఆయన మండల పరిషత్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 1994లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పెద్దపల్లి నియోజకవర్గం నుంచి పోటీ చేసి విజయం సాధించారు.

● ముత్తారం మండలం ఖమ్మంపల్లి గ్రామానికి చెందిన చంద్రుపట్ల రామ్‌రెడ్డి 1976, 1981లో జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో రెండు పర్యాయాలు వరుసగా విజయం సాధించారు. ఆ తర్వాత తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంతో ఆ పార్టీలో చేరిన ఆయన 1994లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మంథని నియోజకవర్గం అభ్యర్థిగా పోటీ చేసి మాజీ స్పీకర్ శ్రీపాదరావుపై విజయం సాధించారు.

### ● ఎంపీటీసీలు, జడ్పీటీసీలుగా..

ప్రస్తుత పెద్దపల్లి శాసన సభ్యులు చింతకుంట విజయ రమణారావు స్థానిక సంస్థల నుంచి చట్టసభలకు ఎన్నికయ్యారు.

(మిగతా 8వ పేజీలో)

## బోధన పద్ధతుల్లో మార్పు కనిపించాలి

● కలెక్టర్ కోయ శ్రీహర్ష



ప్రధానోపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కోయశ్రీహర్ష

పెద్దపల్లి కల్చరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో నెల రోజుల్లో బోధన పద్ధతుల్లో మార్పులు కనిపించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో అకాడమిక్ ప్యానెల్ బృందాల పాఠశాలల పరిశీలనపై అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు 16 ఉన్నత పాఠశాలల్లో అకాడమిక్ ప్యానల్ బృందాలు తనిఖీ చేసి, వారు పరిశీలించిన అంశాలు, విద్యార్థుల కనీస అభ్యాసన సామర్థ్యం, విద్యార్థుల హాజరు సంఖ్య వివరాలను అందించారని కలెక్టర్ తెలిపారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల టీఎల్ఎంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రాబోయే నెల రోజుల వ్యవధిలో ఉపాధ్యాయుల పనితీరు మార్చుకోవాలని లేనిపక్షంలో కఠినంగా వ్యవహరించాల్సి ఉంటుందని కలెక్టర్ అన్నారు. తరగతి గదిలో విద్యార్థులు కనీసం 80 శాతం పాఠ్యాంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అకాడమిక్ మానిటరింగ్ అధికారి పీఎం షేక్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# నామినేషన్ల జోరు

- ముగిసిన రెండో విడత నామినేషన్లు
- నేటి నుంచి మూడో విడత దాఖలు

పెద్దపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రెండో విడత పంచాయతీ ఎన్నికల నామినేషన్ల పర్వం మంగళవారం నాటితో ముగిసింది. చివరి రోజు పెద్ద ఎత్తున అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసే క్లస్టర్ కేంద్రాలకు వచ్చి అర్ధరాత్రి వరకు బారులు తీరారు. మొదటి రోజు అంతంత మాత్రంగానే నామినేషన్లు వచ్చినప్పటికీ, రెండు రోజులుగా నామినేషన్ల పర్వం జోరుగా సాగింది. సాయంత్రం 5 గంటల వరకే నామినేషన్ల గడువు ముగిసినప్పటికీ, ఆ లోపు కేంద్రాల్లో ఉన్న అభ్యర్థులు నామినేషన్లు వేసేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. రెండో విడతలో పాలకుర్తి, అంతర్గాం, ధర్మారం, జూలపల్లి మండలాల్లోని గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహిస్తున్నారు.

● అంతర్గాం 15 గ్రామపంచాయతీలకు సర్పంచ్‌కు 111, వార్డులు 132గాను 309 నామినేషన్లు వచ్చాయి.

● ధర్మారం 29 పంచాయతీలకు సర్పంచ్ 228, వార్డులు 266గాను 726 నామినేషన్లు వచ్చాయి.



కుక్కలగూడూర్‌లో నామినేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకులు నర్సింహారెడ్డి

● జూలపల్లి 13 పంచాయతీలకు 100 నామినేషన్లు సర్పంచ్‌కు, 130 వార్డులకు 369 నామినేషన్లు దాఖలయ్యాయి.

● పాలకుర్తి 16 పంచాయతీలకు 140 నామినేషన్లు సర్పంచ్‌కు, 156 వార్డులకు 450 నామినేషన్లు వచ్చాయి.

● మొత్తంగా 73 పంచాయతీలకు 579 సర్పంచ్, 684 వార్డులకు 1854 నామినేషన్లు దాఖలయ్యాయి.

బుధవారం నామినేషన్ల పరిశీలన జరగనున్నది. 5వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు విధించారు. 14వ తేదీన ఉదయం 7:30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ జరగనున్నది. అనంతరం కౌంటింగ్ నిర్వహించి ఫలితాలు ప్రకటిస్తారు.

### నేటి నుంచి మూడో విడత

జిల్లాలో మూడో విడత బుధవారం నుంచి 5వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. 6న నామినేషన్ల పరిశీలన, 9న మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు విధించారు. 17న ఉదయం 7:30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ జరగనుంది. సుల్తానాబాద్ మండలంలోని 22 పంచాయతీల్లో సర్పంచ్‌తోపాటు 246 వార్డులకు, ఎలిగేడులోని 12 పంచాయతీల్లో సర్పంచ్‌తో పాటు 114 వార్డులకు, పెద్దపల్లిలోని 30 పంచాయతీల్లో సర్పంచ్‌తోపాటు 294 వార్డు స్థానాలు, ఓదెల 22 పంచాయతీల్లో 198 వార్డు స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి.

## సైబర్ మోసాల బారిన పడకుండా జాగ్రత్త పడాలి : సీపీ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

కోల్‌సిటీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని, అప్రమత్తతతో నేరాలను అరికట్టాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా పేర్కొన్నారు. మంగళవారం కమిషరేట్ కార్యాలయంలో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో ఫ్రాడ్ కా ఫుల్‌స్టాప్ అనే కార్యక్రమంలో భాగంగా ఆరు వారాల సైబర్ భద్రత ప్రచార కార్యక్రమం పోస్టర్లను ఆవిష్కరించారు. రాష్ట్ర వ్యాప్తంగా జూమ్ సమావేశం ద్వారా తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీజీ షికగోయల్ ఆధ్వర్యంలో ప్రారంభ కార్యక్రమం జరిగింది. కమిషనర్ అంబర్ కిశోర్ ఝా మాట్లాడుతూ ఆరు అంశాలపై ఆరు రోజులపాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సైబర్ సారథి ఎట్ 1930, స్కామ్ సే బచావో, పైసా పైలం, హర్ స్క్రీన్ సురక్షిత్, మేరా లాగిన్ మేరా రూల్, మహిళ రక్షణ, పిల్లల సంరక్షణ, 1930 హెల్ప్ లైన్, గోల్డెన్ హవర్ రిపోర్టింగ్ ప్రాముఖ్యత, ఏఐ ఆధారిత నివేదన వేగవంతం అంశాలపై కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ప్రతి పౌరుడు జాగ్రత్తగా, అప్రమత్తంగా ఉండాలన్నారు. ఫ్రాడ్ కా ఫుల్‌స్టాప్‌లో తెలంగాణలో సైబర్ భద్రతను బలోపేతం చేసే ముఖ్య కార్యక్రమమని సీపీ తెలిపారు. ప్రజల్లో అవగాహన కల్పించడానికి పోస్టర్లు, ఆడియో క్లిప్‌లు ముఖ్య కూడళ్లలో ప్రచా రం చేస్తామన్నారు. సోషల్ మీడియా, ఎన్ఎస్ఎస్ కెడెట్లు సైబర్ క్లబ్స్ ద్వారా ప్రతి కాలేజీ నుంచి ఇద్దరు వలంటీర్లను ఎంపిక చేసి ప్రతి కాలేజీ నుంచి ఐదుగురు విద్యార్థులు, ఒక టీచర్‌ను భాగస్వామ్యం చేస్తామన్నారు. కమిషనరేట్‌లో ఒక్కో వారం ఒక్కో టీమ్‌తో అవగాహన కల్పిస్తామన్నారు. డీసీపీ(అడ్మిన్) శ్రీనివాస్, ఏసీపీ రమేష్, సీసీఎస్ ఏసీపీ రంగారెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

# సైన్స్‌అండ్ టెక్నాలజీలో విద్యార్థులు ముందుండాలి

జ్యోతినగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సైన్స్ టెక్నాలజీపై ఆసక్తి చూపాలని, ఆధునిక కాలంలో సైన్స్‌పై అవగాహన పెంచుకొని పరిశోధనల వైపు దృష్టి సారించాలని జిల్లా పరిషత్ సీఈఓ నరేందర్ పేర్కొన్నారు. మంగళవారం ఎన్టీపీసీ టీటీసీలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్‌ఫెయిర్ ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సృజనాత్మకత, సైన్స్‌లో నూతన ఆవిష్కరణలు చేయాలన్నారు. సైన్స్‌ను తమ కెరీర్‌కు ఉపయోగకరంగా ఉండేలా చైతన్యవంతులు కావాలన్నారు. వైజ్ఞానిక ప్రదర్శనల ద్వారా విద్యార్థుల్లో దాగిన సృజనాత్మకతను వెలికి తీస్తుందన్నారు. డీఈవో శారద మాట్లాడుతూ విద్యార్థులు ఎంచుకున్న లక్ష్యాలను సాధించాలన్నారు. సైన్స్ రంగంలో ముందుండాలని, టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని తెలిపారు. మూడు రోజులపాటు కొనసాగే బాల వైజ్ఞానిక ప్రదర్శన, ఇన్‌స్పైర్ అవార్డుల ఎంపిక కార్యక్రమంలో జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. బుధవారం ఆయా కమిటీల ఉపాధ్యాయులు, విద్యార్థులు రూపొందించిన నమునాలను పరిశీలించి ఉత్తమ వాటిని ఎంపిక చేస్తారు. జిల్లా అకాడమిక్ అధికారి షేక్, సైన్స్ అధికారి హనుమంతు, సెక్టోరియల్ అధికారి కవిత, మల్లేష్, అజీమ్, ఎంఈవో మల్లేశం, సురేంద్రకుమార్, హరిప్రసాద్, విమల, రాజయ్య, రాంరెడ్డి, స్వర్ణలత, ఆగయ్య, కొమురయ్య, లక్ష్మి, విజయకుమార్ పాల్గొన్నారు.




మాట్లాడుతున్న జడ్పీ సీఈవో నరేందర్

# వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలి

● శిశువుల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి ● జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వాణిశ్రీ



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ వాణిశ్రీ

సుల్తానాబాద్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది సమయపాలన కచ్చితంగా పాటించాలని, ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాలలో సత్వరం వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వాణిశ్రీ అన్నారు. గర్రెపల్లి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం సందర్శించారు. గర్రెపల్లితో పాటు కొలనూరు, ఓదెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. పలు జాతీయ ఆరోగ్య కార్యక్రమాల పురోగతి గురించి చర్చించారు. అప్పుడే పుట్టిన శిశువుల సంరక్షణపై ఆశాలకు అవగాహన కల్పించారు. ఈ విషయంలో తల్లులకు స్పష్టమైన అవగాహన కల్పించాలన్నారు. గర్భిణీలు తప్పనిసరిగా ఎర్లీ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచిస్తూ తొలి రెండు ఆరోగ్య పరీక్షలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో, మూడు, నాలుగవ పరీక్షలను సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రుల్లో నిర్వహించుకోవాలన్నారు. గర్భిణీల తరలింపునకు 102 వాహన సేవలు వినియోగించుకోవాలన్నారు.

### గ్రామాల వారీగా జ్వరాల సర్వే చేయించాలి

గ్రామాల వారీగా జ్వరాల సర్వే నిర్వహించాలని, జ్వర లక్షణాలు నమోదు చేసుకుంటూ నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీ శుక్రవారం డ్రై డే పాటించాలని, గ్రామాలలో దగ్గు తగ్గని వారిని గుర్తించి జ్వరం, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉంటే క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయాలన్నారు. పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని, ఎవరూ కూడా వ్యాక్సిన్ డ్యూ లేకుండా చూసు కోవాలని అన్నారు. జిల్లా ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ రాజమౌళి, డాక్టర్లు బి శ్రీరాములు, కెవి సుధాకర్ రెడ్డి, బి కిరణ్ కుమార్, ఉదయ్, జిల్లా డేటా మేనేజర్ మహేందర్, డీపీఎం దేవిసింగ్, డిపిసీ తీట్ల రాజేశం, ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## కలెక్టరేట్‌కు చేరుకున్న తెలంగాణ తల్లి విగ్రహం

పెద్దపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అన్ని జిల్లా కలెక్టరేట్ కార్యాలయాల ఆవరణల్లో ఏర్పాటు చేయనున్న తెలంగాణ తల్లి విగ్రహం మంగళవారం కలెక్టరేట్ కార్యాలయానికి హైదరాబాద్ నుంచి వ్యాన్‌లో తీసుక వచ్చారు. ఆ విగ్రహాన్ని క్రేన్ సహాయంతో కొత్తగా నిర్మించిన గద్దెపై నిలబెట్టారు. ఈ నెల 9న విగ్రహాలను ఆవిష్కరించే అవకాశాలున్నాయి. హైదరాబాద్ నుంచి వచ్చిన వ్యాన్‌లో మూడు విగ్రహాలు ఉండగా, ఒకటి ఇక్కడికి, మిగతా రెండు మంచిర్యాల, కొమురంభీం ఆసిఫాబాద్ తరలించారు.



కలెక్టర్ కార్యాలయంలో గద్దెపై తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు

## ఆటో, స్కూటీ ఢీ..

● ముగ్గురికి తీవ్ర గాయాలు



ఢీకొన్న ఆటో, స్కూటీ

వేములవాడ టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలోని రెండోబైపాస్ రోడ్డులోగల దోబీఘాట్ వద్ద మంగళవారం ఆటో, స్కూటీ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈప్రమాదంలో ఆటోడ్రైవర్ భరత్‌కు, మరో ప్రయాణికుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్కూటీపై వెళ్తున్న అర్చకుడు ప్రసన్న కాలు విరిగింది. క్షత గాత్రులను చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు.

## ఇసుక లారీని ఢీకొన్న యువకుడు

● తీవ్ర గాయాలు

వీణవంక, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చల్లూరు గ్రామంలో ఇసుక లారీని ఢీకొని గూడిపాటి రాంరెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం.. జమ్మికుంట మండలం ధర్మారం గ్రామానికి చెందిన రాంరెడ్డి ద్విచక్ర వాహనంపై చల్లూరు నుంచి మామిడాలపల్లికి వెళ్తుండగా పార్కింగ్ సిగ్నల్స్ లేకుండా రోడ్డుమీద నిలిపిన ఇసుక లారీని ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడ్డ రాంరెడ్డిని స్థానికులు వెంటనే 108లో వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. రాంరెడ్డి సోదరి కాసర్ల ప్రత్యూష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఆవుల తిరుపతి తెలిపారు.

# వరి కొయ్యలు కాలిస్తే ముప్పే..



వేములవాడ పట్టణం నాంపల్లిలో వరికొయ్యలకు నిప్పుపెట్టిన రైతు

- భూసారం కోల్పోయి తగ్గనున్న దిగుబడి..
- కలియ దున్నితే పోషక పదార్థాల శాతం పెంపు
- సూచనలు పాటించాలంటున్న వ్యవసాయాధికారులు

వేములవాడ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రైతులు వరిపంటను సేకరించిన తరువాత వరి కొయ్యలను కాల్చుతే వచ్చే దిగుబడులపై ముప్పు వాటిల్లనుంది. వరి కొయ్యలను (కొయ్యకాలు) కల్చాతే నష్టమే తప్ప ఎలాంటి ప్రయోజనం ఉండదని, కాల్చడంతో విపరీతమైన వేడితో భూమి సారాన్ని కోల్పోతుందనే విషయాన్ని రైతులకు గుర్తుంచుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి అఫ్జల్ బేగం చెబుతున్నాడు. వేములవాడ డివిజన్ పరిధిలో రైతులు పంట సేకరించిన తరువాత కొయ్యలను నిప్పంటించి తగలబెడుతున్నారు. గతంలో పంటను కొడవళ్ల సహాయంతో మొదళ్ల వరకు కోసేవారు. పశువులు ఎక్కువగా గ్రామాల్లో ఉండటంతో కొయ్యలను కింది వరకు కట్ చేసి గడ్డివాములు వేస్తూ వరి గడ్డిని నిలువ చేశేవారు. ప్రస్తుతం సాగు విధానంలో మార్పులు రావడంతో యంత్రాలను విరివిగా వినియోగిస్తున్నారు. మిషన్‌తో వరి పంటను కట్ చేయడంతో కొయ్యలు పెద్దగా మిగిలిపోతున్నాయి. దీంతో పొలం సాగు సమయంలో నాగళ్లకు అడ్డుగా వస్తున్నాయనే ఉద్దేశ్యంతో ఎక్కువ శాతం రైతులు కొయ్యలను తగలబెడుతున్నారు. వరికొయ్యలను తగలబెడితే అధిక నష్టాలు వచ్చే అవకాశముందని, రైతులు వ్యవసాయాధికారుల సూచనలు,సలహాలు పాటించాలని సూచిస్తున్నారు.

● అధిక ఉష్ణోగ్రతతో సారాన్ని కోల్పోతుంది..

పంట పొలంలో ధాన్యం సేకరించిన తరువాత కొయ్యలకు నిప్పు పెట్టడంతో అధిక ఉష్ణోగ్రత వెలువడుతుంది. దీంతో పంట దిగుబడిపై ప్రభావం చూపే అవకాశాలు ఉన్నాయి. ముఖ్యంగా భూమిలో ఉండే నత్రజని, పాస్పరస్ లాంటి పోషక విలువల శాతం తగ్గి దిగుబడి తక్కువ వస్తుంది. భూమికి పీచు పదార్థంగా ఉపయోగపడే అవశేషాలు కోల్పో తాయి. పంటకు అవసరమైన ఖనిజ లవణాలు దెబ్బతింటాయి. భూ మిలో ఉన్న సూక్ష్మ జీవులు, వానపాములు, జీవరాసులు చనిపోతాయి.

● వరి కొయ్యలతో కలిగే ప్రయోజనాలు..

వరి పంటను సేకరించిన పిదప కొయ్యలను నేలలో కలియ దున్నడంతో సేంద్రియ కర్బనశాతం పెరిగి దిగుబడులు 10 శాతం వరకు పెరిగే అవ కాశం ఉటుంది. దుక్కిని దున్నే సమయంలో సిం గిల్ సూపర్ ఫాస్పెట్‌ను చల్లితే పక్షం రోజుల్లో కొయ్యలు మురిగి పోషకాలుగా అందుబాటులోకి వచ్చే అవకాశం ఉటుంది. దీంతో డీఏపీ వాడకం సగం వరకు తగ్గించి పెట్టుబడిని ఆదా చేసుకునేందుకు వీలుగా ఉంటుంది. కొయ్యలను కలియ దున్నితో ఒక ఎకర పొలంకు దాదాపుగా టన్ను వరకు ఎరువుతో పాటుగా మొక్కలకు 2 శాతం నత్రజని (యూ రియా) 4 శాతం ఫాస్పరస్ అదనంగా అం దుతుంది. మాంగనీస్, జింక్ కాల్షియం, ఇనుము వంటివి పంటకు ఎంతో మేలు చేకురుస్తాయి. భూ మిలో కరగని మాలకాలను పంటకు అనుకూలంగా మార్చి నీటి నిల్వ సామర్థ్యం పెరిగేం దుకు దోహదపడుతుంది.

**ప్రమాదం వాటిల్లే అవకాశం ఉంది..**

**- జిల్లా వ్యవసాయాధికారిణి అఫ్జల్ బేగం**

ప్రతి రోజు ఒక మండలం చొప్పున రైతులకు వరి కొయ్యలను తగలబెడుతే వచ్చే ప్రమాదాలు, తగ్గె దిగుబడులపై రైతులకు అవగహన కల్పిస్తున్నాం. దీంతో పాటుగా వాతావరణ కాలుష్యంతో పాటుగా రైతుల శ్వాసకోశ వ్యాధులకు గురికావడం, వరికొయ్యలకు నిప్పు అంటించడంతో అధిక మంటలు వ్యాపించి ప్రమాదాల బారిన పడిన సంఘటనలున్నాయి. రైతులు తప్పకుండా వ్యవసాయాధికారుల సలహాలు సూచనలను తప్పకుండా పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చు. వరికొయ్యలను దమ్ము చేసి మురగపెడితే దిగుబడి పెరుగుతుంది.

## ఉమ్మడి జిల్లాలో నలుగురి బలవన్మరణం

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో వివిధ కారణాలతో ఉరివేసుకుని నలుగురు బలవన్మరణం చెందారు. వీరిలో ఇద్దరు విద్యార్థులు ఉన్నారు. వివరాల్లోకి వెళితే..

### ఆర్థిక ఇబ్బందులతో మరమగ్గాల కార్మికుడి ఆత్మహత్య..



బోద శేఖర్(ఫైల్)

సిరిసిల్ల రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కుటుంబ పోషణతో పాటు మరమగ్గాల పరిశ్రమ ఏర్పాటుకోసం చేసిన అప్పులు పెరిగి పోవడంతో వాటిని తీర్చేమార్గం లేక బోద శేఖర్(38) అనే మరమగ్గాల కార్మికుడు మంగళవారం ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన రాజన్నసిరిసిల్లకేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సిరిసిల్ల పట్టణంలోని జ్యోతినగర్‌కు చెందిన బోద శేఖర్ తనకున్న స్థలంలో అప్పులు చేసి మరమగ్గాల పరిశ్రమను ఏర్పాటుచేసుకున్నాడు. రెండు సంవత్సరాల క్రితం సంక్షోభం తలెత్తడంతో పనులు లేక మరమగ్గాల పరిశ్రమను బంద్ చేసి శేఖర్ మరో చోట మరమగ్గాల కార్మికుడిగా పనిచేస్తున్నాడు. మరమగ్గాల పరిశ్రమల ఏర్పాటుతోపాటు కుటుంబ పోషణ కోసం చేసిన అప్పులు వడ్డీతో కలిపి రూ.40లక్షలవరకు పెరిగిపోవడంతో వాటిని తీర్చేమార్గం లేక మంగళవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శేఖర్‌కు భార్య లావణ్య, కుమారుడు, కూతురు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ కృష్ణ తెలిపారు.

### వివాహిత ఆత్మహత్య

ఇల్లంతకుంట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతారం గ్రామానికి చెందిన కుమ్మరవేని లత (28) అనే వివాహిత ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. లత మంగళవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకొని మృతిచెందింది. మృతురాలికి 5 సంవత్సరాల కుమారుడు ఉన్నాడు. మృతిచెందడానికి గల కారణాలు తెలియవలసి ఉంది. వివాహిత మృతిపై ఎస్సై సిరిసిల్ల అశోక్ మాట్లాడుతూ ఇంతవరకు ఎవరు ఫిర్యాదు చేయలేదని పేర్కొన్నారు.

### ఉరి వేసుకుని యువతి బలవన్మరణం

సుల్తానాబాద్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండలం సుద్దాల గ్రామానికి చెందిన ఎనగంటి రిక్షిత(18) ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ఎనగంటి శ్రీనివాసు-రజిత దంపతుల కూతురు ఎనగంటి రిక్షిత కరీంనగర్ లోని ఓ హాస్టల్ ఉంటూ ఇంటర్ విద్య అభ్యసిస్తోంది. ఆరోగ్యం బాగా లేకపోవడంతో హాస్టల్ నుంచి వారంరోజుల కిందట ఇంటికి వచ్చింది. మంగళవారం హాస్టల్‌కు వెళ్లాల్సిఉండగా ఉదయం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుందని కుటుంబసభ్యులు తెలిపారు. తల్లి రజిత ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని సుద్దాల నుంచి పోస్టుమార్టం నిమిత్తం సుల్తానాబాద్ ఆస్పత్రికితరలించి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

### విద్యార్థి ఆత్మహత్య



విజ్ఞాన్(ఫైల్)

శంకరపట్నం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం రాజాపూర్ గ్రామానికి చెందిన ఓ విద్యార్థి ఉస్మానియా యూనివర్సిటీ ప్రాంగణంలో సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం రాజాపూర్ గ్రామానికి చెందిన రెడ్డి విజ్ఞాన్ (21) ఉస్మానియా క్యాంపస్‌లో ఇంజనీరింగ్ విభాగంలో మైనింగ్ డిపార్ట్‌మెంట్‌లో ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. సోమవారం క్యాంపస్‌లోని ఆక్సిజన్ పార్కులో చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విజ్ఞాన్ మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం మంగళవారం స్వగ్రామం రాజాపూర్ తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. విజ్ఞాన్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతికి సంబంధించి కారణాలు తెలియాల్సి ఉంది.

### చికిత్స పొందుతూ యువకుడి మృతి

బోయినపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన బోయినపల్లి మండలం తలగొండ గ్రామంలో మంగళవారం జరిగింది. ఆదివారం గ్రామానికి చెందిన ఎడపల్లి అనురాగ్ (22) స్నేహితుడు పిట్టల అఖిల్ తో కలసి బోయినపల్లి నుంచి తడగొండ వైపు ద్విచక్ర వాహనంపై వస్తున్నారు. అఖిల్ ద్విచక్రవాహనాన్ని అజాగ్రత్తగా నడపడంతో వాహనం అదుపుతప్పి చెట్టును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో అనురాగ్, అఖిలకు తీవ్ర గాయాలు అయ్యాయి. అనురాగ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి తండ్రి రాజేశం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన అఖిల్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామకాంత్ తెలిపారు.

### కొండగట్టు బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి

పెద్దపల్లి కల్చరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు దేవస్థానం కింద జరిగిన అగ్నిప్రమాదంలో నిరాశ్రయులైన వారిని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని టీపీఎఫ్‌జిల్లా అధ్యక్షుడు గుమ్మడి కొమురయ్య కోరారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ కొండగట్టు అభయాంజనేయ స్వామి గుడి ఆవరణలో జరిగిన అగ్నిప్రమాదంలో సుమారు 20షాపులు దగ్ధమైనాయని, బాధితులుసర్వం కోల్పోయారని, వారికి వెంటనే రూ.30లక్షల చొప్పున నష్టపరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్‌చేశారు. ప్రమాదంలో పలువురు విద్యార్థుల సర్టిఫికెట్లు, పిల్లల పెళ్లికోసం దాచుకున్న డబ్బులు, బంగారం కాలి బూడిదగా మారాయని ఆవేదన చెందారు. తెలంగాణ ప్రజాఫ్రంట్ జిల్లా ప్రధానకార్యదర్శి పులిపాక రవీందర్, జిల్లాఉపాధ్యక్షుడు గాండ్ల మల్లేశం, జిల్లాకార్యవర్గ సభ్యులు రాజు, సుధాకర్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

### ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కరీంనగర్ క్రైం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌రూరల్ మండలం నగునూర్‌గ్రామంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను మంగళవారం పట్టుకున్నామని కరీంనగర్‌రూరల్ సీఐ ఏ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ట్రాక్టర్‌డ్రైవర్ బాతుల వీరయ్యపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిందితుడిని తహసీల్దార్ ఎదుట హాజరుపరచి లక్షరూపాయల సొంతపూచీకత్తుపై బైండోవర్‌చేసినట్లు సీఐ తెలిపారు. మరికొందరు సస్పెక్ట్ షీటర్లను కూడా బైండోవర్ చేసినట్లు తెలిపారు.

### మద్యం మత్తులో విగ్రహం ధ్వంసం

ఓదెల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బీమరపల్లిలో సోమవారం రాత్రి ఓవ్యక్తి మద్యంమత్తులో భూలక్ష్మి విగ్రహాన్ని ధ్వంసం చేశాడు. రెండేళ్లక్రితం గ్రామస్థులు భూలక్ష్మి, మహాలక్ష్మి, బొడ్రాయి విగ్రహాలను ప్రతిష్ఠించారు. మద్యం మత్తులో ఓవ్యక్తి విగ్రహం ధ్వంసం చేశాడు. రెండునెలలక్రితం పొత్కపల్లిలోని పెద్దమ్మ ఆలయం ముందున్న పోతరాజు విగ్రహాన్ని మద్యం మత్తులో గుర్తుతెలియని వ్యక్తి ధ్వంసం చేశాడు. వరుస సంఘటనలతో గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### శ్రీనగర్ కాలనీలో చోరీ

కరీంనగర్ క్రైం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శ్రీనగర్ కాలనీలోని ఒక ఇంటిలో దొంగలు చొరబడి 8 గ్రాముల బంగారం ఎత్తుకుపోయారని బాధితులు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. శనివారం ఇంటికి తాళం వేసిన ఇంటి యజమాని హుస్నాబాద్‌కు వెళ్లి మంగళవారం ఉదయం వచ్చి చూసే సరికి తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా 8 గ్రాముల బంగారం కనపడకుండా పోయింది. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని సీఐ కే సృజన్‌రెడ్డి తెలిపారు.

## నామినేషన్ విత్‌డ్రా చేసుకోవాలని దాడి..

● నలుగురిపై కేసు నమోదు

తంగళ్లపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నామినేషన్ విత్‌డ్రా చేసుకోవాలని బెదిరింపులకు పాల్పడి దాడిచేసిన నలుగురిపై కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ ఉపేంద్రచారి తెలిపారు. తంగళ్లపల్లి మండలం అంకిరెడ్డిపల్లె గ్రామపంచాయతీ ఒకటవ వార్డుకు సుంకపాక శరత్ నామినేషన్ దాఖలు చేశాడు. నామినేషన్ విత్‌డ్రా చేసుకోవాలని అదే గ్రామానికి చెందిన దేవచంద్రం, సాయి, కంకర రాజు, కంకర కిషన్ దాడిచేసి చంపుతామని బెదిరింపులకు పాల్పడ్డారు. సుంకపాక శరత్ పెద్దనాన్న సుంకపాక దేవయ్య పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదుమేరకు నలుగురిపై కేసునమోదు చేసుకునిదర్యాప్తుచేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### మద్యం బాటిళ్ల పట్టివేత

జమ్మికుంట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ఆబాదిజమ్మికుంటలో అక్రమంగా నిల్వఉంచిన మద్యం బాటిళ్లను మంగళవారం పోలీస్‌లు స్వాధీనం చేసుకున్నారు. బోళ్ల శంకర్ అనేవ్యక్తి మద్యం బాటిళ్ల విక్రయిస్తుండగా పోలీస్‌లు పట్టుకున్నారు. అతడివద్దఉన్న రూ.5790విలువగల మద్యంను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు పట్టణసీఐ ఎస్ రామకృష్ణాగౌడ్ తెలిపారు.

### పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

కరీంనగర్ క్రైం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌గడ్డకు చెందిన ముస్తాఫా అనేవ్యక్తి గత ఫిబ్రవరి 25న తన సెల్‌ఫోన్‌ను బొమ్మకల్‌లో పోగొట్టుకోగా కరీంనగర్‌రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా ఆ ఫోన్ వరంగల్‌లో ఉన్నట్లు గుర్తించి రికవరీ చేశారు. ఆ సెల్‌ఫోన్‌ను కరీంనగర్ రూరల్‌సీఐ ఏ నిరంజన్‌రెడ్డి మంగళవారం యజమాని ముస్తాఫాకు అందజేశారు. ఫోన్ రికవరీకి కృషిచేసిన కానిస్టేబుల్ విశ్వతేజను సీఐ అభినందించారు.

# కారు అదుపుతప్పి.. ప్రమాదం

● ఇద్దరి పరిస్థితి విషమం ● మరో ముగ్గురికి గాయాలు



పల్టీ కొట్టిన కారు



గాయపడ్డ బాలుడికి సీపీఆర్ చేస్తున్న స్థానికులు

తిమ్మాపూర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాజీవ్‌రహదారిపై ఓ కారు అదుపుతప్పి డివైడర్ పైనుంచి దూసుకువచ్చి అవతలివైపు వెళ్తున్న మరోకారుపై పడింది. ఈ ప్రమాదంలో పలువురు గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. కరీంనగర్ కట్టరాంపూర్‌కి చెందిన పెండ్యాల కిషన్‌రెడ్డి, ఆయన భార్య పెండ్యాల విజయ, కోడలు పెండ్యాల దివ్య, మనుమండ్లు అహన్(8), 2నెలల వయస్సుగల చిన్నబాబుతో కలిసి హైదా రాబాద్ నుంచి మంగళవారం కరీంనగర్‌కు వస్తున్నారు. తిమ్మాపూర్ మండలంలోని ఇందిరానగర్ చౌరస్తాకు సమీపంలో రాజీవ్ రహదారిపై వీరు ప్రయాణిస్తున్న కారు అతివేగంగా ఉండటంతో అదుపు తప్పి రోడ్డు డివైడర్ పైనుంచి కరీంనగర్ నుంచి హైదారాబాద్ వైపువెళ్తున్న మరో కారుపైకి దూసుకెళ్లి రోడ్డు కిందికి పల్టీకొట్టింది. ఈ ప్రమాదంలో కట్టరాంపూర్‌కి చెందిన ఒకే కుటుంబంలోని ఐదుగురికి గాయాలు కాగా అందులో ఇద్దరిపరిస్థితి విషమంగా ఉంది. మరో కారులో బెలూన్‌లు తెరుచుకోవడంతో బెజ్జంకి తహసీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న ఆర్ఐ కలికోట సంతోష్‌కుమార్, టైపిస్ట్ తోడెలు రమేష్, బెజ్జంకి పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న తాడగొండ కనుకయ్య స్వల్పగాయాలతో బయటపడ్డారు. సంఘటన స్థలానికి ఎల్ఎండీ పోలీసులు చేరుకొని క్షతగాత్రులను చికిత్సనిమిత్తం కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎల్ఎండీ ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.

## విద్యార్థులు, మహిళల భద్రతకు షీటీం ప్రత్యేక చర్యలు



అవగాహన కల్పిస్తున్న షీ టీం సభ్యులు

జ్యోతినగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మహిళలు, విద్యార్థుల భద్రతకు షీ టీం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని షీ టీం మెంబర్ స్నేహలత తెలిపారు. మంగళవారం ఎన్‌టీపీసీ, టీటీఎస్‌లోని సచిదేవా హైస్కూల్, కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. వారు చేపడు తున్న భద్రత చర్యలను వివరించి, ఎవరైనా ఇబ్బందులకు గురిచేస్తే మొదట తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వాలని, ఆ తర్వాత తమను సంప్రదించాలన్నారు. ఆపద సమయాల్లో డయల్ 100, అలాగే 6303923700కు ఫోన్ చేయాలన్నారు. మొబైల్ ఫోన్‌ద్వారా ఆన్‌లైన్ గేమ్స్, సైబర్ క్రైమ్‌లు పెరుగుతున్నాయని, వాటికి దూరంగా ఉండాలన్నారు. సోషల్ మీడియాను మంచి కోసం వినియోగించుకోవాలని సూచించారు. సైబర్ క్రైమ్‌కు మోసపోయిన వారు వెంటనే 1930 నెంబర్‌కు సమాచారం ఇస్తే వారు చర్యలు చేపడుతారన్నారు. మహిళల రక్షణకు షీటీం మెంబర్లు పలు రద్దీ ప్రాంతాలు, బస్టాండ్ల వద్ద నిఘా ఉంటుందని తెలిపారు. షీటీం సభ్యులు మౌనిక, సురేష్, ప్రిన్సిపాల్ జ్ఞాన్‌చంద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## దొంగలు బాబోయ్.. దొంగలు

● వరుస చోరీలతో భయం గుప్పిట్లో ప్రజలు



బొంతుపల్లిలో చోరీకి గురైన ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న పోలీసులు(ఫైల్)

వీణవంక, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ బోరు మోటర్ల కేబుల్ వైర్ల చోరీలు పెరిగిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వీణవంక మండలంలోని బేతిగల్ కనపర్తి నర్సింగాపూర్, బొంతుపల్లి గ్రామాల్లో వ్యవసాయబోరు మోటార్ల కేబుల్‌వైర్లను గుర్తుతెలియని వ్యక్తులు కట్‌చేసి ఎత్తుకెళ్తున్నారు. పదుల సంఖ్యలో రైతుల మోటార్ల కేబుల్ వైర్లు ఎత్తుకెళ్తుండడంతో రైతులకు ఇబ్బందిగా మారింది. కొత్త కేబుల్ వైర్లు వేయాల్సి వస్తుండడంతో ఒక్కో రైతుకు నాలుగు నుంచి ఆరువేల ఖర్చు అవుతుండడంతో ఆర్థికంగా నష్టపోతున్నారు. వ్యవసాయ బావులవద్ద గల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి దొంగలు కాపర్‌తీగ ఎత్తెకెళ్తుండడంతో విద్యుత్ అధికారులకు, రైతులకు ఇబ్బందిగా మారింది. మరోవైపు ఇటీవల కనపర్తిలో ఓ ఇంట్లో బంగారం ఎత్తుకెళ్లారు. వీణవంక గ్రామశివారులో మేకలు మేపుతుండగా మేకను బైకుపై వచ్చి ఎత్తుకెళ్లారు. గ్రామాల్లో సీసీ కెమెరాలు ఉన్నా పూర్తిస్థాయిలో పనిచేయకపోవడంతో దొంగలకు ఆసరాగా మారింది. వరుస దొంగతనాలతో మండల ప్రజలు భయం గుప్పిట్లో బతుకుతున్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి వైర్ల దొంగలపై, ఇతర చోరీలపై ప్రత్యేక నిఘాఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## గంజాయి సేవిస్తున్నారని యువకులను.. అదుపులోకి తీసుకున్న పోలీసులు

జగిత్యాల టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రంలోని వివేకానంద మినీ స్టేడియంలో కొందరు యువకులు గంజాయి సేవిస్తున్నారనే సమాచారం మేరకు పట్టణ పోలీసులు పలువురు యువకులను అదుపులోకి తీసుకున్నారు. వివేకానంద స్టేడియంలో మంగళవారం జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగుల క్రీడలకు ఏర్పాట్లు చేస్తున్నారు. అక్కడే కూర్చొని ఉన్న కొందరు యువకులు ఏదో సేవిస్తున్నారు. వారి వైపునుంచి వస్తున్న పొగకు ఇబ్బంది పడ్డ ఉద్యోగులు కొందరు యువకులు గంజాయి సేవిస్తు ఇబ్బందులకు గురి చేస్తున్నారని పోలీసులకు సమాచారం అందించారు. పట్టణ పోలీసులు అక్కడికి చేరుకొని ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకోగా మిగతావారు అక్కడి నుండి జారుకున్నారు. యువకులను పోలీస్ స్టేషన్ తరలించిన పోలీసులు విచారించి అది గంజాయి కాదని హుక్కా అని వదిలిపెట్టారు. అయితే అది హుక్కా కాదని గంజాయితో తయారు చేసిన హ్యాష్ ఆయిల్ అని సంక్షేమ శాఖ ఉద్యోగులు పేర్కొంటున్నారు. దీనిపై పూర్తి విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

# దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు

● అదనపు కలెక్టర్ బీఎస్ లత ● ఘనంగా దివ్యాంగుల క్రీడాపోటీలు



క్రీడలను ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ లత

జగిత్యాల అగ్రికల్చర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్ లత అన్నారు. జిల్లా కేంద్రంలోని స్థానిక మినీ స్టేడియంలో దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని దివ్యాంగులకు ఆటలపోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన లత మాట్లాడుతూ దివ్యాంగుల సాధికారత, విద్య, ఉపాధి అవకాశాల విస్తరణ, నైపుణ్యాల అభివృద్ధి కార్యక్రమాల ప్రాముఖ్యతను వివరిస్తూ, దివ్యాంగులు జీవితంలోని ప్రతిరంగంలో ప్రతిభను చాటగల సామర్థ్యం కలిగి ఉన్నారని, సమాజం వారికి ప్రోత్సహించేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వసంక్షేమపథకాల సహకారంతో దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేందుకు జిల్లా పరిపాలన అన్నివిధాలుగా సహకరిస్తుందన్నారు. జిల్లాలోని అన్ని మండలాల నుంచి దివ్యాంగులు పెద్ద సంఖ్యలో హాజరై రన్నింగ్, షాట్‌పుట్, చెస్, జావెలిన్ త్రో, ఫీల్డ్ ఈవెంట్స్ వంటి వివిధ విభాగాల్లో పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచినవారికి త్వరలోనే పురస్కారాలు, ప్రశంసాపత్రాలు అందజేయబడుతాయని జిల్లాసంక్షేమ అధికారి డాక్టర్‌నరేష్ తెలిపారు. దివ్యాంగుల సంక్షేమం, నైపుణ్యాభివృద్ధి, సాధికారత పరంగా జిల్లాలో మరిన్ని కార్యక్రమాలు కొనసాగించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో జిల్లాయువజన క్రీడలఅధికారి రవికుమార్, డీఈవో రాము, సీడీపీవోమమత, ఈవోపవిత్ర, సీనియర్ అసిస్టెంట్ చంద్రమోహన్, ఫీల్డ్‌రెస్పాన్స్ అధికారులు కొండయ్య, డీసీపీవో హరీష్, ఎఫ్ఆర్‌వో కొండయ్య, మిషన్‌శక్తిసిబ్బంది, సూపర్‌వైజర్లు, అంగన్వాడీ సిబ్బంది, దివ్యాంగులు పాల్గొన్నారు.

## రాజన్న సన్నిధిలో వైభవంగా గీతా జయంతి

● కన్నుల పండువగా పూర్ణాహుతి



పూర్ణాహుతి గావిస్తున్న వేదపండితులు

వేములవాడ టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజ రాజేశ్వరస్వామి దేవస్థానంలో గీతా జయంతి ఉత్సవాలు మంగళవారం వైభవంగా జరిగాయి. శనివారం ప్రారంభమైన ఉత్సవాలు మంగళవారం ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా ఉదయం 7-30 గంటలకు నాగిరెడ్డి మండపంలో మహాన్యాసపూర్వక ఏకాదశరుద్రాభిషేకం, అర్చనలు, గీతా హోమంస్వామివారికి ఏకాంతంగా నిర్వహించారు. అనుబంధ ఆలయాల్లో శాస్త్రోక్త పద్ధతిలో ప్రత్యేకపూజలు, అర్చనలు నిర్వహించారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా రాజన్నఆలయంలో ఉదయం 11-15గంటలకు పూర్ణాహుతి, కలశోద్వాసన కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో ఎల్ రమాదేవి పాల్గొన్నారు.

## భీమన్న సన్నిధిలోని శిలా శాసనాల పరిశీలన



శాసనాన్ని పరిశీలిస్తున్న సాగర్

వేములవాడ టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వేములవాడ భీమేశ్వరాలయంలోని ప్రాచీన పురావస్తు విగ్రహాలు, డజన్‌కు పైగా ఉన్న శాసనాలను మంగళవారం కరీంనగర్ పురావస్తు శాఖ సహాయసంచాలకుడు ఎన్ సాగర్, స్థానిక చరిత్ర కారుడు సంకేపల్లి నాగేంద్ర శర్మ పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్, ఆలయ ఈవోఎల్ రమాదేవిని కలిసి సైట్ మ్యూజియం ఏర్పాటుచేయాలని కోరారు. ఈ సందర్భంగా భీమేశ్వరాలయాన్ని సందర్శించి స్వామివారిని దర్శించుకున్నారు. భీమేశ్వరాలయం గోడకు ఉన్న ప్రాచీనశాసనాన్ని, బాదామి చాళుక్యుల కాలం నాటి వినాయక విగ్రహాన్ని పరిశీలించారు.

# వస్తే సర్పంచ్ పదవి.. పోతే ఎకరం..



## పైసలుంటేనే పంచాయతీ బరిలో..

● భారీగా ఖర్చు పెట్టేందుకు సిద్ధమవుతున్న అభ్యర్థులు

హుజూరాబాద్‌రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలను పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో గెలుపే లక్ష్యంగా పావులు కదుపుతున్నారు. డబ్బులు ఖర్చు పెట్టేవారినే సర్పంచ్ అభ్యర్థులుగా బరిలో ఉంచేందుకు పార్టీల నాయకులు చర్చలు జరుపుతున్నారు. దీంతో ఖర్చు భరించే వారినే అభ్యర్థులుగా ఎంపిక చేసే యోచనలో ఉన్నారు. పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తూ పోటీ చేయాలని ఉత్సాహం ఆసక్తి ఉన్న వారికి సైతం సరైన ఆర్థిక స్థోమత లేకపోతే అభ్యర్థులుగా అవకాశం కల్పించే పరిస్థితులు కనిపించడం లేదు. గ్రామానికి సేవ చేయాలనే తపన ఉన్నా డబ్బు లేకపోతే ఎన్నికల్లో పోటీ చేసే పరిస్థితులు లేవు. సామాజికవర్గం సమీకరణలు, ప్రజాదరణతో పాటు ఆర్థిక బలం ఉన్న వారిని అన్వేషిస్తున్నారు.

● జనరల్ స్థానాల్లో రూ. 10 లక్షల నుంచి రూ. 25 లక్షలు

జనరల్, బీసీ స్థానాల్లో పోటీ తీవ్రత అధికంగా ఉంది. ఎంత ఖర్చయినా కొందరు వెనుకాడడం లేదు. ఆశావాహులు తమ అభ్యర్థిత్వాలు ఖరారు కాకముందే గ్రామాల్లో ప్రతిరోజు వేలల్లో ఖర్చు చేస్తున్నారు. సమావేశాలు పెడుతూ తనకే మద్దతు ఇవ్వాలని కోరుతూ ఖర్చు పెడుతున్నారు. జనరల్ పంచాయతీల్లో 10 లక్షల నుంచి 25 లక్షలు ఖర్చు పెట్టే వారికి అవకాశం ఇవ్వాలని పార్టీల నాయకులు చూస్తున్నారు. ఆయకట్టు గ్రామాల్లో సర్పంచ్ పదవికి ఎక్కువ డిమాండ్ ఉంది. అక్కడ 50 లక్షల వరకు ఖర్చు పెట్టేందుకు పలువురు సిద్ధంగా ఉన్నారు. కొన్ని గ్రామాల్లో 25 లక్షల నుంచి 40 లక్షల వరకు ఖర్చు చేసేందుకు సిద్ధమే అంటున్నారు. వస్తే సర్పంచ్ పదవి పోతే ఎకరం భూమి అంటూ బరిలో నిలిచేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

● పంచాయతీలకు ఆదాయాన్ని తెచ్చిన ఎన్నికలు

ఎన్నికలు పంచాయతీలకు కాసుల పంట కురుస్తోంది. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తప్పనిసరిగా ఇంటి పన్ను చెల్లించి ఉండాలనే నిబంధన ఉంది. దీంతో పోటీ చేసే వారు పన్నులు చెల్లిస్తున్నారు. మూడోదశ నామినేషన్ల స్వీకరణ ఘట్టం ప్రారంభమవుతుండడంతో పలు గ్రామాల్లో ఇప్పటికే ఎన్నికల వాతావరణం నెలకొంది. ఈ క్రమంలో వార్డు సభ్యులు, సర్పంచ్‌లుగా బరిలో నిలిచే అభ్యర్థులు తమ బకాయిలను పెండింగ్‌లో ఉంచుకోవద్దనే ఉద్దేశ్యంతో ఇంటి పన్నులు చెల్లిస్తున్నారు. దీంతో మొండి బకాయిల సమస్య తీరింది. ప్రతి ఏడాది మార్చిలోపు వసూళ్ల ప్రక్రియ ముగుస్తుంది. మరో నాలుగు నెలల ముందే బకాయిలు వసూళ్లు అవుతుండడంతో సిబ్బంది సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

● అయ్యగారూ.. ముహూర్తం చూడండి



గ్రామపంచాయతీ ఎన్నికల సంగ్రామంలో రెండో విడత నామినేషనర్ల పర్వం మంగళవారంతో ముగియనుంది. మూడో విడుతకు సంబంధించి బుధవారం నుంచి నామినేషన్లు ప్రారంభమవుతాయి. చివరి విడతలో ఉన్న ఆశావాహులు సెంటిమెంట్లకు పదునుపెట్టారు. సర్పంచ్, వార్డు స్థానాలకు పోటీచేసే వారు తమ నామినేషన్లు ఏ శుభఘడియాల్లో వేయాలని ఆరా తీస్తూ పురోహితులను ఆశ్రయిస్తున్నారు. మూడో విడతలో ఈ నెల 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు నామినేషనర్ల పర్వ కొనసాగనుంది. అందులో 3వ తేదీ త్రయోదశితో పాటు బుధవారాన్ని శుభకరంగా భావిస్తారు. 4వ తేదీ దత్తాత్రేయ జయంతి ఉన్నా చతుర్ధశితో పాటు యుక్త పౌర్ణమితో అంతగా యోగ్యమైన ముహూర్తంగా భావించరు. 5వ తేదీ శుక్రవారంతో పాటు పాడ్యమి తిథి కావడంతో శుభముహూర్తంగా పండితులు చెబుతున్నారు. దీంతో మూడో విడతలో చివరిరోజు నామినేషన్లు ఎక్కువ సంఖ్యలో వేసే అవకాశాలు ఉన్నాయి.

## రేపు అతిథి అధ్యాపకులకు ఇంటర్వ్యూ

గణేశ్‌నగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మహిళాడిగ్రీ కళాశాల కరీంనగర్ లోని రసాయనశాస్త్ర విభాగంలో ఎమ్మెస్సీ కెమిస్ట్రీ బోధించుటకు గురువారం అతిథి అధ్యాపకులకు వాక్‌ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిం చనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డి వరలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. అభ్య ర్థులు తేదీ 4న ఉదయం 11 గంటలకు సర్టిఫి కెట్లతో హాజరు కావాలని తెలిపారు. వివరాలకు రసాయన శాస్త్ర విభాగంలో సంప్రదించాలని తెలిపారు.

## విదేశాల్లో విద్య, ఉద్యోగాలపై అవగాహన తరగతులు

గణేశ్‌నగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలోని బీసీ, ఇతర విద్యార్థులకు విదేశాలలో ఉన్న అత్యున్నత విశ్వ విద్యాలయాలలో ఉన్నత విద్యను అభ్యసించేందుకు అవకాశాలపై బీసీ స్టడీ సర్కిల్‌లో అవగాహన తరగతులు ప్రారంభిస్తున్నట్లు కరీంనగర్ బీసీ స్టడీ సర్కిల్ ఎం.రవికుమార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆసక్తి కలిగిన కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాలకు చెందిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిఉన్న గ్రాడ్యుయేషన్ (ప్రొఫెషనల్, నాన్ ప్రొఫెషనల్) ఉత్తీర్ణత పొందిన అభ్యర్థులు తేదీ 2-12-2025 నుంచి 21-12-2025 వరకు టీజీ బీసీస్టడీ సర్కిల్ వెబ్సైట్ "www.tgbc-studycircle.cgg.gov.in" ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మరింత సమాచారం కోసం ఫోన్: 0878-2268686,040-24071178 సంప్రదించాలని కోరారు.

# క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలి

● కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి ● రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల విజేతలుగా వరంగల్, మహబూబ్‌నగర్



ఫైనల్స్‌లో తలపడుతున్న మహబూబ్‌నగర్ - వరంగల్ బాలికల జట్లు

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీరించాలని, నేటి ఓటమి రేపటి గెలుపునకు నాంది అని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. రాజన్న సిరిసిల్లజిల్లా కేంద్రం మినీ స్టేడియంలో జరుగుతున్న 8వ రాష్ట్రస్థాయి బాలబాలికల జూనియర్స్ వాలీబాల్ పోటీలు పోటీలు మంగళవారం ముగిశాయి. ఫైనల్‌పోటీల్లో బాలురవిభాగంలో వరంగల్-ఖమ్మం ఉమ్మడిజిల్లాలు, బాలికల విభాగంలో మహబూబ్‌నగర్ - వరంగల్ ఉమ్మడి జిల్లాల జట్లు తలపడ్డాయి. బాలురవిభాగంలో వరంగల్ జిల్లా జట్టు ప్రథమ స్థానంలో, ఖమ్మం జిల్లా జట్టు ద్వితీయ స్థానంలో, మహబూబ్‌నగర్ జిల్లాజట్టు తృతీయ స్థానంలో నిలిచాయి. బాలికల విభాగంలో మహబూబ్‌నగర్ - వరంగల్ జట్లు తలపడగా, వరంగల్ జిల్లా ప్రథమ స్థానంలో, వరంగల్ జిల్లా జట్టు ద్వితీయ స్థానంలో, నిజామాబాద్ జిల్లా జట్టు తృతీయ స్థానంలో నిలిచాయి. అనంతరం మినీ స్టేడియంలో ముఖ్య అతిథులు కేకే మహేందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ ఛైర్మన్‌నాగుల సత్యనారాయణ, మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ వెల్ముల స్వరూపతిరుపతిరెడ్డిలు విజేతలకు కప్‌లతోపాటు మెడల్స్, మెరిట్ సర్టిఫికెట్లను అందించి అభినందించారు. ఈ సందర్భంగా కేకే మహేందర్‌రెడ్డి మాట్లాడారు. క్రీడాకారుడైన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారధ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యతో పాటు క్రీడలను ప్రోత్సహిస్తోందన్నారు. రాష్ట్ర స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారని అన్నారు. క్రీడలలో ప్రపంచ దేశాలతో మనం కూడా పోటి పడుతున్నామని ఒలింపిక్స్‌లో తెలంగాణ బిడ్డలు పతకాలను తీసుకొస్తున్నారన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాకు ఆర్చరీ అకాడమీ ఏర్పాటుకు శాప్ ఛైర్మన్ శివసేనారెడ్డిని తీసుకొచ్చి చూపించామని, త్వరలో అధికారికంగా ప్రకటించే అవకాశం ఉందన్నారు. క్రీడాకారులు వ్యాయామం చేసుకోవాడనికి మినీ స్టేడియంలో జిమ్‌ను త్వరంలో ప్రారంభించుకోబోతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు గజ్జెల రమేష్ బాబు, ప్రధాన కార్యదర్శి ఎన్వీ హన్మంతరెడ్డి, కోశాధికారి కృష్ణప్రసాద్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గిన్నె లక్ష్మణ్, రాజన్నసిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు చెన్నమనేని శ్రీకుమార్, ప్రధాన కార్యదర్శి అజ్మీరారాందాస్, ఉపాధ్యక్షులు చింతకింది శ్యాంకుమార్, సహాయ కార్యదర్శులు లక్ష్మణ్, రామస్వామి, కార్యనిర్వహణ కార్యదర్శి పిల్లి రాంచంద్రం గౌడ్, కోశాధికారి కోడం శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు గుడ్ల రవి, రెఫరీ అసోసియేషన్ రాష్ట్ర ఛైర్మన్ గణపతి, కన్వీర్ రవీందర్, కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, వివిధ జిల్లాలో వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు, కోచ్‌లు, మేనేజర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## రెడ్కో ఉమ్మడి జిల్లా మేనేజర్‌గా దురిశెట్టి మనోహర్



కలెక్టర్ సత్యప్రసాద్‌కు పూలమొక్క అందిస్తున్న మేనేజర్ మనోహర్

జగిత్యాల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రెడ్కో ఉమ్మడిజిల్లా మేనేజర్‌గా ట్రాన్స్‌కో రిటైర్డ్ ఏడీఈ దురిశెట్టి మనోహర్‌ను నియమిస్తూ తెలంగాణ రాష్ట్ర పునరుద్ధరణీయ ఇంధన వనరుల సంస్థ (రెడ్కో) ఉత్తర్వులు జారీ చేసింది. మంగళవారం జిల్లాకేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ సత్యప్రసాద్‌ను రెడ్కో ఉమ్మడి జిల్లా మేనేజర్ దురిశెట్టి మనోహర్ మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్కను అందించారు. ఈసందర్భంగా మనోహర్ మాట్లాడుతూ హరిత ఇంధన ఉత్పత్తిలో పీఎం సూర్యఘర్, పీఎం-కుసుమ్, ఈవీ-చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు, తదితర ప్రభుత్వ పథకాల అమలు, సోలార్ రూఫ్ టాప్‌ల ఏర్పాటు, వ్యవసాయ భూముల్లో రైతుల ప్రయివేటు సోలార్ ప్రాజెక్టుల స్థాపన, ప్రభుత్వ భవనాలపై సోలార్ పలకల ఏర్పాటు వంటి నిర్దేశించిన లక్ష్యాలను ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో వేగవంతంగా సాధించాలన్న లక్ష్యంతో నియామకం చేశారన్నారు. తన నియామకానికి సహకరించిన ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రెడ్కోఛైర్మన్ డాక్టర్‌శరత్, ఎండీ అనిల తదితరులకు మనోహర్ కృతజ్ఞతలు తెలిపారు.

## పేర్ల మార్పు కోసం డీడీఎన్ అర్చకులకు ఇంటర్వ్యూలు

కరీంనగర్ కల్చరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని దేవాదాయ ధర్మాదాయశాఖ సహాయకమిషనర్ కార్యాలయంలో మంగళవారం ధూపదీప నైవేద్య పథకం క్రింద గతంలో మంజూరీ అయిన ఆలయాలలో ఏర్పడ్డ పోస్టుల భర్తీలో భాగంగా పేర్లు మార్పు కోసం ఉమ్మడి జిల్లాకు చెందిన అర్చకులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 3మెన్ కమిటీలో ఉమ్మడిజిల్లా సహాయకమిషనర్ నాయిని సుప్రియ పర్యవేక్షణలో ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ పాము సత్యనారాయణ, సంప్రదాయ పరంగా వేములవాడ, కొండగట్టు ఆంజనేయస్వామి, ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి సీనియర్‌అర్చకులు శరత్‌కుమార్‌శర్మ, చిరంజీవస్వామి, నంబి నరసింహస్వామి, సిబ్బంది పాల్గొన్నారు. కాగా నియామకమైనవారు ఆయా ఆలయాల్లో డీడీఎన్ అర్చకులుగా విధులు నిర్వర్తించనున్నారు.

## ఘనంగా దత్తాత్రేయ నవరాత్రి ఉత్సవాలు



దత్తాత్రేయ స్వామికి హారతి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ధర్మపురి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో దత్తాత్రేయ స్వామి నవరాత్రోత్సవాల్లో భాగంగా ఆరవ రోజు మంగళవారం ఘనంగా పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా రామలింగేశ్వర స్వామి వారికి రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం దత్తాత్రేయ స్వామి ఆలయంలో, గోదావరి నదీ తీరాన గల శ్రీ దత్తాత్రేయ స్వామి ఆలయాల్లో స్వామి వారలను అందంగా పూలతో అలకంరణ చేసారు. ఆలయ వేదపండితులు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ జక్కు రవీందర్, ధర్మకర్తల మండలి సభ్యులు ఒజ్జల సౌజన్యనరేందర్ పాల్గొన్నారు.

● మంత్రి పూజలు..

ధర్మపురి క్షేత్రంలోని దత్తాత్రేయ స్వామి సన్నిధిలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మంగళవారం పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద అర్చకులు కళొజ్జల శేఖర్ మంత్రికి ఘనంగా స్వాగతం పలికారు. ఆయన వెంట టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ జక్కు రవీందర్ పాల్గొన్నారు.

# బద్ది పోచమ్మ సన్నిధిలో భక్తుల సందడి



బద్ది పోచమ్మకు బోనం సమర్పించేందుకు బారులు తీరిన భక్తులు



కొండగట్టు అంజన్న ఆలయ ఆవరణలో భక్తులు

వేములవాడ టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వేములవాడలోని బద్దిపోచమ్మ ఆలయంలో మంగళవారం భక్తులు సందడినెలకొంది. ముందురోజు భక్తులు భీమేశ్వరస్వామి దర్శనం చేసుకుని అనంతరం అమ్మవారికి బోనాలు సమర్పించారు. పట్నాలు, కల్లు బెల్లంసాక, తదితర మొక్కులు చెల్లించారు. ఆలయానికి వచ్చినభక్తులతో ఈవో రమాదేవి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటిఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని సిబ్బందికి సూచనలు చేశారు. పర్యవేక్షణలో ఏఈవో జి అశోక్‌కుమార్, పర్యవేక్షకుడు వెంకటప్రసాద్, ఎస్పీఎఫ్‌సిబ్బంది, ఆలయ ఉద్యోగులున్నారు.

**కొండగట్టులో..**

మల్యాల : కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయం శనివారం భక్తులతో సందడిగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా వచ్చిన భక్తులు స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

## ఈ నెల 13, 24 తేదీల్లో శబరిమలకు రెండు ప్రత్యేక రైళ్లు

పెద్దపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప భక్తుల సౌకర్యార్థం ఈనెల, వచ్చేనెలలో దక్షిణమధ్య రైల్వే ప్రత్యేకరైళ్లను నడుపుతోంది. అందులో భాగంగా ఈనెల13,24తేదీల్లో నడవనున్న రైళ్లకు పెద్దపల్లి రైల్వేజంక్షన్‌లో హాల్టింగ్ కల్పించారు. ఈనెల 13న ఉదయం రైలు నంబర్ 07117 సిర్పూర్ కాగజ్‌నగర్‌లో ఉదయం 10గంటలకు కొల్లాం వరకు బయలుదేరనున్నది. ఈరైలు బెల్లంపల్లి, మంచిర్యాలమీదుగా రామగుండంకు ఉదయం11:18 గంటలకు చేరుకోనున్నది. పెద్దపల్లిజంక్షన్‌కు 11:38గంటలకు, జమ్మికుంటకుమధ్యాహ్నం 12:20గంటలకు చేరుకోనున్నది. వరంగల్, విజయవాడ, గూడూరు, తిరుపతి,కాట్పాడి,ఈరోడ్, కోయంబత్తూర్, పాలక్కాడ్, ఎర్నాకుళం, కొట్టాయం మీదుగా కొల్లాంకు మరుసటిరోజురాత్రి 7గంటలకు చేరుకోనున్నది. అలాగేఈనెల24న తెల్లవారుజామున 4:25గంటలకు నాందేడ్‌లో బయలు దేరి మరుసటిరోజు రాత్రి 10గంటలకు కొల్లాం చేరుకోనున్నది. ఈరైలు నిజామాబాద్, ఆర్మూర్, కోరుట్ల,జగిత్యాల,కరీంనగర్,పెద్దపల్లి, జమ్మికుంట,వరంగల్ మీదుగా శబరిమలచేరుకోనున్నది. కరీంనగర్‌కు ఉదయం10గంటలకు, పెద్దపల్లికిఉదయం 10:50గంటలకు, జమ్మికుంటకు ఉదయం మధ్యాహ్నం 12:20 గంటలకు చేరుకోనున్నది.

## బాబోయ్ కుక్కలు..



గంభీరావుపేటలో కేజీ టూ పీజీ ప్రాంగణంలో కుక్కల గుంపు

గంభీరావుపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేటలో వీధి కుక్కలు బెడద అధికమైంది. రోడ్లపై గుంపులు గుంపులుగా శునకాలు తిరుగుతూ ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. రోడ్లపై, కాలనీల్లో, స్కూళ్లవద్ద కుక్కల బెడద వెంటాడుతోంది. ద్విచక్ర వాహనదారులపైకి ఒక్కసారిగా దూసుకు వస్తుండటంతో రోడ్డు ప్రమాదానికి గురై గాయాల పాలవుతున్నారు. పిల్లలను బడులకు, సమీప దుకాణాలకు పంపాలంటే తల్లిదండ్రులు జంకుతున్నారు. మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో వందల సంఖ్యలో ప్రజలు కుక్క కాటుకు గురైన వారు ఉన్నారు. అప్పట్లో లక్ష్మీపూర్ గ్రామ సమీపాన కుక్కలు వెంబడించడంతో ఓ వ్యక్తిబైక్‌పై నుంచి కిందపడి ప్రాణాలు కోల్పోయాడు. ఇప్పటికైనా కుక్కల బారినుంచి తమను రక్షించాలని స్థానికులు కోరారు.

## వీధి కుక్కల దాడిలో ఒకరికి తీవ్ర గాయాలు

కరీంనగర్ క్రైం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. పలుకాలనీల్లో దాడులకు దిగుతుండటంతో వృద్ధులు, పిల్లలు, మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కరీంనగర్ రాంనగర్ ప్రాంతంలో 4రోజుల క్రితం వెంకట రమణారావు అనే వ్యాపారిపై కుక్కలు దాడి చేయగా తీవ్రంగా గాయపడ్డాడు. అతడు ప్రస్తుతం ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నాడని టూటౌన్ సీఐ సృజన్‌రెడ్డి తెలిపారు. రాంనగర్ నుంచి సంతోష్‌నగర్ వైపు బైక్‌పై వెళుతున్న రమణారావును ఒక ప్రైవేట్ స్కూల్ వద్ద రోడ్డుపై వీధికుక్కలు వెంటపడటంతో అతను తప్పించుకునే ప్రయత్నంలో కిందపడటంతో తలకు తీవ్రగాయాలై అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. వెంటనే గమనించిన స్థానికులు అతన్ని ఆసుపత్రికి తరలించారు. బార్యజమాని అయిన వెంకట రమణారావు ఆరోగ్య పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు తెలిసింది.

## ట్రాన్స్‌ఫార్మర్‌ను గద్దెపై ఏర్పాటు చేయరూ..



రోడ్డుకు సమానంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

ముత్తారం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లేమార్గంలో విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ఈ మార్గంలో రోడ్డుపక్కన ట్రాన్స్‌ఫార్మర్ కోసం గద్దె నిర్మించి ఏళ్లగడుస్తున్నా ఇప్పటికీ అక్క డ ట్రాన్స్‌ఫార్మర్ బిగించలేదు. అయితే అక్కడున్న ట్రాన్స్‌ఫార్మర్ రోడ్డుకు సమానంగా ఉంది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి. ఈట్రాన్స్‌ఫార్మర్‌కు సమీపంలో జూనియర్ కళాశాల ఉండటంతో నిత్యం ఈరోడ్డుగుండా చాలామంది రాకపోకలు సాగిస్తుంటారు. అంతేగాకుండా ఈ రోడ్డు పారుపల్లి గ్రామానికి వెళ్లేమార్గం కావడంతో నిత్యం చాలా మంది ప్రయాణిస్తుంటారు. ఏదైనా వాహనం అదుపుతప్పితే నేరుగా ట్రాన్స్‌ఫార్మర్‌కు ఢీ కొట్టే పరిస్థితులున్నాయి. అంతేగా కుండా పశువులు ట్రాన్స్‌ఫార్మర్ పక్కనున్న గడ్డి మేసేందుకు వెళ్తే విద్యుత్‌షాక్‌కు గురయ్యే అవకాశాలు లేకపోలేదు. ఇప్పటికైనా విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి హైలెవల్ గద్దెపై ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాట చేయాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

## రూ.7,250 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, డిసెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో బుధవారం క్వింటాల్ పత్తి ధర రూ.7,250 పలికింది. మంగళవారం మార్కెట్‌యార్డుకు 58మంది రైతులు 366క్వింటాళ్ల విడిపత్తి విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలంపాట ద్వారా గరిష్ట ధర రూ.7,250, కనిష్ట ధర రూ.6,500 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.



పత్తి వేలం పాట నిర్వహిస్తున్న వ్యాపారులు

## ప్రతిభా అవార్డులకు దరఖాస్తుల స్వీకరణ రద్దు

పెద్దపల్లి కల్చరల్, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): పలు రంగాల్లో ఉత్తమ సేవా, ప్రతిభ కనబరిచిన క్రైస్తవ వ్యక్తులు, సంస్థలు అవార్డు లకు దరఖాస్తు స్వీకరణలు రద్దు చేస్తున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి నరేష్ కుమార్ తెలిపారు. గ్రామపంచాయతీ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న నేపథ్యంలో దీనిని రద్దు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. అధికారిక స్పష్టత వచ్చిన తర్వాత మళ్లీ నోటిఫికేషన్ ఇవ్వనున్నట్లు ఆయన వివరించారు.

## పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన డీసీపీ

రామగిరి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను మంగళవారం రాత్రి డీసీపీ భూక్యారాంరెడ్డి, ఏసీపీ మడత రమేశ్‌లు పరిశీలించారు. కల్వచర్ల, పన్నూరు, రత్నాపూర్, బేగంపేట్ గ్రామాలను సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించి సందర్శించారు. పోలింగ్ కేంద్రాల పరిసరాలను పర్యవేక్షించారు. శాంతిభద్రతల పరంగా తీసుకోవాల్సిన పలు సూచనలను అధికారులకు సూచించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడకుండా అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. చట్టవ్యతిరేక చర్యలు ఎవరు చేసిన వారిపై కఠినచర్యలు తీసుకుంటామని డీసీపీ తెలిపారు. సిఐ బి. రాజు, రామగిరి ఎస్ఐలు తాడవేని శ్రీనివాస్, పి. దివ్య పాల్గొన్నారు.

## కార్మికుల భద్రతకు బీమా పాలసీలు

సుల్తానాబాద్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల కోసం వివిధ ప్రభుత్వ రంగ బీమా కంపెనీల ద్వారా కార్మికులకు భద్రత కల్పిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ తిప్పరాజురమేష్ అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో ఇండియన్ పోస్టల్ పేమెంట్స్ బ్యాంక్ ద్వారా అందించే వివిధ పాలసీలపై మున్సిపల్ కార్మికులకు పెద్దపల్లి పోస్టల్ బ్రాంచ్ మేనేజర్ మోహన్‌సాయితో అవగాహన కల్పించారు. ప్రభుత్వం కార్మికుల కోసం పోస్ట్ ఆఫీసుల ద్వారా మూడు స్కీములు ఉన్నాయని, సంవత్సరానికి 549 రూపాయలతో పాలసీ తీసుకుంటే ప్రమాదంలో మరణించినా శాశ్వత అంగవైకల్యం కలిగినా పది లక్షల బీమా ఇస్తుందన్నారు. ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన ద్వారా 436 రూపాయలు చెల్లిస్తే ఎలాంటి మృతిఅయినా రెండు లక్షలు వస్తాయన్నారు. మున్సిపల్ కార్మికులకు బీమా కల్పించి వారి భద్రతకు కృషి చేస్తామన్నారు. మున్సిపల్ మేనేజర్ అలీమొద్దీన్, ఏఈ రాజ్ కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

## తహసీల్దార్‌ను సన్మానించిన మీ సేవ ఆపరేటర్లు

మంథని, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మంథని తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీరించిన ఎండీ ఆరీఫొద్దీన్‌ను పట్టణంలోని మీసేవ ఆపరేటర్లు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. జిల్లా అధ్యక్షుడు అట్టెం రాజు, ప్రయాకర్‌రావు చంద్రశేఖర, పర్శవేన సతీష్, పుప్పాల సతీష్, మేడి వెంకటేశ్వర్లు, బండారి రమేష్, వేల్పుల శ్రీకాంత్, కాయితోజు సాయికిరణ్‌లు పాల్గొన్నారు.

## మహాసభలను విజయవంతం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

జ్యోతినగర్, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): మెదక్ పట్టణంలో ఈ నెల 7న జరగనున్న సీఐటీయూ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని నాయకులు పోస్టర్లను ఆవిష్కరించారు. మంగళవారం రామగుండం ఇండస్ట్రీయల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు యాకూబ్, ప్రధాన కార్యదర్శి గీట్ల లక్ష్మారెడ్డి ఎన్టీపీసీ గేట్ నెంబర్ 2 వద్ద పోస్టర్లు ఆవిష్కరించి మాట్లాడారు. 7న రాష్ట్ర 5వ మహాసభలు జరుగుతాయని, ప్రదర్శన అనంతరం బహిరంగ సభ ఉంటుందన్నారు. బుధవారం గోదావరిఖనిలోని సీఐటీయూ ఆఫీసు నుంచి 2కే రన్ చేపట్టామన్నారు. గీట్ల లక్ష్మారెడ్డి, ఉపాధ్యక్షుడు రామాచారి, మల్లేష్, అర్జున్, కృష్ణ, ప్రభాకర్ రెడ్డి, రాజేశం పాల్గొన్నారు.

కోల్‌సిటీ, (ఆంధ్రజ్యోతి): మెదక్‌లో ఈనెల 7 నుంచి 9వరకు జరగనున్న సీఐటీయూ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ యూనియన్ జిల్లా అధ్యక్షకార్యదర్శులు కుమారస్వామి, ముత్యంరావు పేర్కొన్నారు. మంగళవారం మున్సిపల్ కార్పొరేషన్ కాంట్రాక్టు కార్మికుల సమావేశంలో మాట్లాడారు. రమణ, సమ్మక్క, రామలక్ష్మి, కిషన్‌నాయక్, రవీందర్, సారయ్య, శోభన్, సాగర్ పాల్గొన్నారు.

## ముగిసిన రెండో విడత నామినేషన్ల ప్రక్రియ

ధర్మారం/పాలకుర్తి/అంతర్గాం డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ధర్మారం, పాలకుర్తి, అంతర్గాం నామినేషన్ల ప్రక్రియ మంగళవారంతో ముగిసింది. నామినేషన్ల ప్రక్రియలో అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎస్ఐ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. పలు నామినేషన్ కేంద్రాలను ఎన్నికల పరిశీలకుడు నరసింహరెడ్డి, మండల అభివృద్ధి అధికారులు, రెవెన్యూ అధికారులు, నామినేషన్ కేంద్రాలను పరిశీలించారు.

## 10న సమ్మక్క జాతర దుకాణాలకు వేలం

మార్కండేయకాలనీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని గోదావరి బ్రిడ్జి వద్ద జనవరి 28 నుంచి 31వరకు నిర్వహించే సమ్మక్క - సారలమ్మ జాతరలో వ్యాపారం నిర్వహించడానికి ఈ నెల 10న టెండర్ కం బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఎండోమెంట్ ఈఓ, జాతర కమిటీ చైర్మన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గోదావరిఖని బీ గెస్ట్ హౌస్ సమీపంలోని సారలమ్మ దేవాలయంలో 10వ తేదీ ఉదయం 11.30 గంటల నుంచి వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. టెంకాయలు, బెల్లం(బంగారం) విక్రయానికి రూ.2లక్షలు, దుకాణాలు నిర్వహణ రూ.3.5లక్షలు, తలనీలాలు రూ.2లక్షలు, లడ్డు ప్రసాదాలు విక్రయం రూ.1.5 లక్షలు, కొబ్బరి ముక్కలు, బెల్లం పోగు రూ.1.5 లక్షలు, చల్లని పానియాలు రూ.50వేలు కేటాయించారు. టెండర్‌లో పాల్గొనే వారు యూనియన్ బ్యాంకులో సమ్మక్క - సారలమ్మ జాతర కార్యనిర్వాహణాధికారి పేర డీడీ, నగదు రశీదు తీసుకుని సీల్డ్ టెండర్‌కు జతపరచాలన్నారు. ఈ నెల 10 ఉదయం 11గంటల లోగా టెండర్ బాక్స్‌లో వేయాలని, 11.30గంటలకు వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. టెండరు దరఖాస్తు ఫారాలు ఈ నెల 8 నుంచి 10వరకు రూ.200 రుసుం చెల్లించి పొందాలన్నారు.

# పంచాయతీ నుంచే తొలి అడుగు...

(5వ పేజీ తరువాయి)

తెలుగుదేశం పార్టీ ద్వారా రాజకీయ అరంగేట్రం చేసిన ఆయన 1995లో జరిగిన మండల, జిల్లా పరిషత్ ఎన్నికల్లో జూలపల్లి జెడ్పీటీసిగా పోటీ చేసే విజయం సాధించారు. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో ఓదెల జడ్పీటిసిగా పోటీ చేసినప్పటికీ గెలపొందలేదు. 2009లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అనూహ్యంగా పెద్దపల్లి టికెట్ సాధించిన విజయరమణారావు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గీట్ల ముకుందరెడ్డిపై విజయం సాధించారు. ఆ తర్వాత 2014, 2018 ఎన్నికల్లో ఓటమి చెందినప్పటికీ, 2023లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా విజయం సాధించారు.

● గోదావరిఖనికి చెందిన కాసిపేట లింగయ్య టీఆర్ఎస్ పార్టీ ద్వారా రాజకీయాల్లోకి వచ్చిన ఆయన 2001లో జరిగిన మండల జిల్లా పరిషత్ ఎన్నికల్లో జూలపల్లి జెడ్పీటిసిగా గెలుపొందారు. 2004లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్ పార్టీతో పొత్తు పెట్టుకోగా ఉమ్మడి జిల్లాలోని నేరెళ్ల నియోజకవర్గాన్ని టీఆర్ఎస్‌కు కేటాయించారు. అక్కడి నుంచి పోటీచేసి ఆయన విజయం సాధించారు. ప్రస్తుతం ఆయన బీజేపీలో కొనసాగుతున్నారు.

● గోదావరిఖనికి చెందిన అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఎన్ఎస్ యువ ద్వారా రాజకీయాల్లోకి వచ్చారు. ఆయన అప్పటి మేడారం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసినప్పటికీ గెలుపొం దలేదు. దీంతో 2006లో జరిగిన జడ్పీటిసి ఎన్నికల్లో ధర్మారం మండలం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. ఆ తర్వాత ఆయన వరుసగా ధర్మపురి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి చెందినప్పటికీ, 2023లో జరిగిన ఎన్నికల్లో విజయం సాధించారు. ఎమ్మెల్యేగా గెలుపొందడమే కాకుండా మంత్రి పదవి సైతం దక్కడం విశేషం.

● మంథనికి చెందిన పుట్ట మధుకర్ ఎన్ఎస్‌యుఐ ద్వారా రాజకీయాల్లోకి రాగా ఆయన 2001లో జరిగిన మండల పరిషత్ ఎన్నికల్లో ఎంపీటీసీ పదవికి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి గెలు పొందారు. అలాగే ఎంపీపీ కూడా చేశారు. 2006లో జరిగిన ఎన్నికల్లో మంథని నుంచి జెడ్పీటిసిగా పోటీ చేసి జిల్లా పరిషత్‌లో అడుగు పెట్టారు. ఆ తర్వాత ఆయన కాంగ్రెస్ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. 2009లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజారాజ్యం పార్టీ ద్వారా ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి చెందారు. 2009లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అనూహ్యంగా టీఆర్ఎస్ టికెట్‌పై పోటీ చేసిన పుట్ట మధుకర్ దుద్దిళ్ల శ్రీధర్‌బాబుపై విజయం సాధించారు. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో ఓటమి చెందినప్పటికీ, 2019లో జరిగిన జిల్లా పరిషత్ ఎన్నికల్లో కమాన్‌పూర్ మండలం నుంచి జెడ్పీటిసిగా పోటీ చేసి గెలుపొంది జెడ్పీ చైర్మన్ అయ్యారు.

● **మున్సిపాలిటీ ద్వారా..**

రామగుండం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేలుగా గెలుపొందిన సోమారపు సత్యనారాయణ, కోరుకంటి చందర్ మొదట రామగుండం మున్సిపాలిటీలో కౌన్సిలర్‌గా పోటీ చేసి గెలుపొందారు. 1999లో రామగుండం మున్సిపాలిటీగా ఏర్పడ్డ తర్వాత కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా గెలుపొందిన సత్యనారాయణ మున్సిపల్ చైర్మన్ అయ్యారు. ఆ తర్వాత 2009లో రామగుండం నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా ఎమ్మెల్యేగా పోటీచేసి విజయం సాధించారు. 2014లో టీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన రెండోసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు.

అలాగే 2004లో మున్సిపల్ కౌన్సిలర్‌గా గెలుపొందిన కోరుకంటి చందర్ టీఆర్ఎస్ ద్వారా రాజకీయాల్లోకి వచ్చారు. ఆ తర్వాత 2009లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసినప్పటికీ గెలుపొందలేదు. 2014లో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థిగా గట్టి పోటీనిచ్చి ఓటమి చెందగా, 2018లో జరిగిన ఎన్నికల్లో టిఆర్ఎస్ టికెట్ దక్కకపోవడంతో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నుంచి పోటీ చేసి విజయం సాధించారు. 2023లో టిఆర్ఎస్ టికెట్‌పై పోటీ చేసినప్పటికీ విజయం సాధించలేదు. జిల్లా నుంచి చట్టసభలకు ఎన్నికైన దాదాపు పది మంది నాయకులు స్థానిక సంస్థల నుంచే రావడంతో ఆ ఎన్నికలకు జిల్లాలో ప్రాధాన్యం ఏర్పడింది.

## పర్యావరణ పరిక్షణపై అవగాహన

కోల్‌సిటీటౌన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం సెక్రెడ్ హార్ట్ స్కూల్‌లో ఎన్‌సీసీ క్యాడెట్‌లకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఎన్‌సీసీ ఫస్ట్ ఆఫీసర్ జ్యోత్స్న ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కాలుష్య కారకాలను వివరించారు. మొక్కలు పెంచడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడాన్ని క్యాడెట్లు పాటించాలని సూచించారు. ప్రకృతిని కాపాడితేనే మానవ మనుగడ సాధ్యమని, మారిన జీవన విధానంలో కాలుష్య కారణంగా అనేక అనర్థాలు జరుగుతున్నట్లు పేర్కొన్నారు. ఎన్‌సీసీ క్యాడెట్లు మొక్కలను నాటారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఆరోగ్య మేరి ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నిత్యావసర సరుకుల పంపిణీ

పెద్దపల్లి రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మూలసాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు కమలా ఫౌండేషన్ అధ్యక్షుడు, ఆంగ్ల ఉపాధ్యాయులు సాదుల వెంకటేశ్వర్లు మంగళవారం మధ్యాహ్న భోజనం కోసం నిత్యావసర సరుకులు అందజేశారు. ఉపాధ్యాయులు సంజీవ్, తిరుపతి, సదానందం, రాజన్న, జ్యోతి, రమ, రజిత పాల్గొన్నారు.

# మూడో విడత నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు

సుల్తానాబాద్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మూడో విడత పంచాయతీ ఎన్నికలలో భాగంగా బుధవారం నుంచి ప్రారంభమయ్యే నామినేషన్ స్వీకరణకు అధికారులు ఏర్పాట్లు చేశారు. నియమ నిబంధనల మేరకు విధులు నిర్వహించాలని ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు అధికారులకు, సిబ్బందికి సూచించారు. మంగళవారం ఎన్నికల రిటర్నింగ్, అసి స్టెంట్ రిటర్నింగ్ అధికారులకు నిర్వహించిన సమావేశంలో అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ సర్పంచ్, వార్డు సభ్యులు నామినేషన్ దాఖలు చేసే సమయంలో నామినేషన్ పత్రంతో పాటు అభ్యర్థి స్వీయ ప్రకటన పత్రం జత చేయాలన్నారు. సుల్తానాబాద్ మండలంలో 27 గ్రామ పంచాయతీలకు, 246 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇందుకు గాను 800 మంది ఎన్నికల సిబ్బందిని నియమించారు.

- సాంబయ్యపల్లి క్లస్టర్‌లో: గొల్లపల్లి, నారాయణరావుపల్లి, సాంబయ్యపల్లి
- గర్రెపల్లిలో: నర్సయ్యపల్లి, గర్రెపల్లి, బొంతకుంటపల్లి, కాట్నపల్లి
- ఐతరాజుపల్లిలో: దుబ్బపల్లి, భూపతిపూర్, ఐతురాజుపల్లి
- గట్టేపల్లిలో: నీరుకుళ్ల, కదంబాపూర్, గట్టేపల్లి
- కనుకులలో: రామునిపల్లి, కనుకుల, మంచరామి, తొగర్రాయి
- రేగడిమద్దికుంటలో: సుద్దాల, అల్లీపూర్, రేగడిమద్దికుంట
- చిన్నబొంకూరులో: చిన్నకలువల, చిన్నబొంకూరు, మియాపూర్
- నారాయణపూర్‌లో: కొదురుపాక, నారాయణపూర్, దేవునిపల్లి, కందునూరుపల్లి

### ఓదెల మండలంలో...

**ఓదెల, (ఆంధ్రజ్యోతి)** : ఓదెల మండలంలోని 22 గ్రామాల్లో సర్పంచ్, వార్డు సభ్యులకు బుధవారం నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభం అవుతుంది. సర్పంచ్ అభ్యర్థుల నుంచి జనరల్ గ్రామాలకు రూ.రెండు వేలు, ఎస్సీ, ఎస్టీ సర్పంచ్ అభ్యర్థులకు రూ, వెయ్యి, జనరల్ వార్డులకు రూ, ఐదు వందలు, ఎస్సీ, ఎస్టీ వార్డు సభ్యులకు రూ.250 చొప్పున రుసుం చెల్లించాల్సి ఉంది. అలాగే 22 గ్రామాలకు గాను ఆరు క్లస్టర్లను ఏర్పాటు చేశారు.

- ఓదెల క్లస్టర్‌లో: నాంసానిపల్లి, అబ్బిడిపల్లి, లంబాడ తండ, ఓదెల
- కొలనూర్‌లో: హరిపురం, గోపరపల్లి, ఉప్పరపల్లి, కొలనూర్



కనుకులలో అధికారులతో మాట్లాడుతున్న ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు, బ్రాహ్మణపల్లి రైతువేదికలో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాస్

- కనగర్తిలో: మడక, గుండ్లపల్లి, పిట్టలఎ ల్లయ్యపల్లి, కనగర్తి
- పొత్కపల్లిలో: శానగొండ, రూపునారాయణపేట, పొత్కపల్లి
- కొమిరలో: జీలకుంట, భీమరపల్లి, కొమిర
- బయమ్మపల్లిలో: ఇందుర్తి, గుంపుల, గూడెం, బయమ్మపల్లి

గ్రామాలకు చెందిన సర్పంచ్ అభ్యర్థులు నామినేషన్ దరఖాస్తులను అందజేయాలి.

### పెద్దపల్లి మండలంలో

పెద్దపల్లి రూరల్, (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి మండలంలోని 30 గ్రామపంచాయతీల సర్పంచ్, వార్డు సభ్యుల పదవులకు పోటీ చేసే అభ్యర్థుల నుంచి నామినేషన్‌లు స్వీకరించేందుకు 12 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో కొప్పుల శ్రీనివాస్ తెలిపారు.

- అప్పన్నపేటలో : అప్పన్నపేట,
- చీకురాయి రైతువేదికలో: భోజన్నపేట, చీకురాయి,
- బొంపల్లి జీపీలో: బొంపల్లి, కనగర్తి, కాపులపల్లి,
- ముత్తారం జీపీలో: గౌరెడ్డిపేట, హన్మంతునిపేట, ముత్తారం,
- కాసులపల్లి జీపీలో: కాసులపల్లి, గోపయ్యపల్లి, పాలితం,
- కొత్తపల్లి రైతువేదికలో: కొత్తపల్లి, మూలసాల
- రాంపల్లి రైతువేదికలో: మారేడుగొండ, గుర్రాంపల్లి, రాంపల్లి,
- పెద్దకల్వల జీపీలో: పెద్దకల్వల, పెద్దబొంకూర్, నిమ్మనపల్లి,
- రాఘవపూర్ రైతువేదికలో: రాఘవపూర్, అందుగులపల్లి,
- బ్రాహ్మణపల్లి రైతువేదికలో: రాగినేడు, కుర్మపల్లి, బ్రాహ్మణపల్లి,
- రంగాపూర్ జీపీలో: సబ్బితం, రంగాపూర్, దేవునిపల్లి,
- తుర్కలమద్దికుంట జీపీలో: తుర్కలమద్దికుంట, నిట్టూరు

గ్రామాల అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరిస్తారు.

### నామినేషన్‌లను సజావుగా నిర్వహించాలి

పెద్దపల్లి మండలంలో మూడో విడతలో భాగంగా పంచాయతీ ఎన్నికలకు నిర్వహించే నామినేషన్‌ల స్వీకరణ సజావుగా నిర్వహించాలని ఎంపీడీవో కొప్పుల శ్రీనివాస్ అన్నారు. బ్రాహ్మణపల్లి రైతు వేదికలో మంగళవారం ఆర్వోలు, ఏఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులకు నామినేషన్‌ల స్వీకరణ, ఎన్నికల నిర్వహణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ నామినేషన్‌ల స్వీకరణలో ప్రభుత్వ ఆదేశాలు తప్పనిసరిగా పాటించాలన్నారు. ఏంపీవో శరత్‌బాబు, ఆర్వోలు, ఏఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

### ఎలిగేడు మండలంలో

ఎలిగేడు, (ఆంధ్రజ్యోతి): మండలంలోని 12 గ్రామపంచాయతీలకు బుధవారం నుంచి నామినేషన్ల స్వీకరణ ఉంటుందని ఎంపీడీఓ భాస్కర్ రావు పేర్కొన్నారు. 12 గ్రామపంచాయతీలతోపాటు 114 వార్డు స్థానాలు ఉన్నాయని, 18570 మంది ఓటర్లు ఉన్నట్లు పేర్కొన్నారు. నామినేషన్ వేసేందుకు నాలుగు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు.

- ఎలిగేడులో: నారాయణపల్లి, లాలపల్లి, ఎలిగేడు
- ధూళికట్టలో: ముప్పిరితోట, లోకపేట, ధూళికట్ట
- సుల్తాన్‌పూర్‌లో: బుర్హాన్‌మియాపేట, సుల్తాన్‌పూర్
- నర్సాపూర్‌లో: ర్యాకల్‌దేవుపల్లి, రాములపల్లి, నర్సాపూర్, శివపల్లి

గ్రామాల అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయాలని తెలిపారు.

## గుర్తులు కేటాయించిన వెంటనే బ్యాలెట్లు ముద్రించాలి : కలెక్టర్

పెద్దపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలకు సంబంధించి అభ్యర్థులకు గుర్తులను కేటాయించిన వెంటనే బ్యాలెట్ పత్రాలను ముద్రించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికలకు మరో 9 రోజుల సమయం ఉందని, రిటర్నింగ్ అధికారులు, పోలింగ్ అధికారులు, సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించాలన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ కల్పించాలని, రెండో సిబ్బంది ర్యాండమైజేషన్ పూర్తయిన తర్వాత పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసిన తర్వాత నిబంధనల ప్రకారం పోటీ చేసే అభ్యర్థుల ప్రకటన, గుర్తుల కేటాయింపు, బ్యాలెట్ పేపర్ ముద్రణ ప్రణాళిక చేసుకోవాలన్నారు. బ్యాలెట్ బాక్సుల తరలింపు కోసం రవాణా సౌకర్యాలు కల్పించాలన్నారు. ప్రతి అభ్యర్థికి వ్యయ వివరాలు అందించాలని నోటీసులు జారీ చేయాలన్నారు. మొదటి విడత పోలింగ్ జరిగే గ్రామాలకు బ్యాలెట్ బాక్సుల తరలింపు ప్రారంభించాలన్నారు. 6న మండల స్థాయిలో పీవో, ఏపీవోలకు శిక్షణ నిర్వహించి, అక్కడే పోస్టల్ బ్యాలెట్ ఏర్పాటు చేశామన్నారు. కౌంటింగ్, పోలింగ్ కేంద్రాల వద్ద లైటింగ్ ఉండాలని కలెక్టర్ తెలిపారు. పోలింగ్ ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలన్నారు. డీపీఓ వీరబుచ్చయ్య, జడ్పీ సీఈవో నరేందర్, డీఆర్డీఓ కాళిందిని, డీసీఓ శ్రీమాల, పాల్గొన్నారు.

## మానవ జీవితానికి దిక్సూచి భగవద్గీత

ఫైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): భగవద్గీత మానవుడి జీవనానికి దిక్సూచి లాంటిదని అఖిల భారతీయ ధర్మజాగరణ సహ సంయోజక్ ఆలె శ్యాంజీ పేర్కొన్నారు. మంగళవారం రాత్రి వెంకటేశ్వర ఆలయంలో నిర్వహించిన గీతా జయంతి కార్యక్రమంలో మాట్లాడారు. వ్యక్తిత్వ వికాసానికి గీతా పారాయణం ఉపయోగపడుతుందని, ఐదు వేల ఏళ్ళ క్రితం అర్జునుడికి శ్రీకృష్ణుడు గీతను ఉపదేశించినట్లు శ్యాంజీ తెలిపారు. కాలనీ పురవీధుల గుండా షిర్కే బస్టాండ్ నుండి ఆలయం వరకు శోభాయాత్ర నిర్వహించారు. గాయత్రి విశ్వకర్మ శారదా పీఠం ఉత్తరాధికారి చంద్రమౌళీశ్వర స్వామి, ఆలయ అర్చకులు జగన్నాథాచార్యులు, హిందూ సంఘాల నాయకులు ముత్యాల బాలయ్య, మూకిరి రాజు, శశికుమార్, దాసరి శ్రీనివాస్, సారంగపాణి, లింగంనాయక్ భక్తులు పాల్గొన్నారు.

## ముహూర్తాల కోసం పురోహితుల వద్దకు...

పెద్దపల్లి రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి మండలంలోని 30 గ్రామ పంచాయతీలకు మూడో విడతలో ఎన్నికలు జరగనున్నాయి. మూడో విడత నామినేషన్‌లు ఈనెల బుధవారం నుంచి ప్రారంభం అవుతున్నాయి. అయితే సర్పంచ్, వార్డు సభ్యులుగా పోటీ చేసే అభ్యర్థులు వారి జాతకం ఎలా ఉందంటూ జ్యోతిష్యులు, పురోహితులను ఆశ్రయిస్తున్నారు. ఏ రోజు నామినేషన్ వేయాలి.. ఏ సమయంలో వేయాలి అని పురోహితుల ద్వారా తెలుసుకుంటున్నారు. అంతే కాకుండా పోటీ చేసే అభ్యర్థులు ఇప్పటి నుండే ప్రచారాలు చేపడుతున్నారు. మరి కొందరు కుల సంఘాలతో సమావేశమై హామీలు ఇస్తున్నారు. ఒకే కులం నుంచి ఒకరే నామినేషన్ వేసేలా తీర్మానాలు జరుగుతున్నాయి.

# రామగుండంలో కమీషన్ల పాలన

గోదావరిఖని, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో, రామగుండంలో కమీషన్ల పాలన నడుస్తోందని, ప్రశ్నించిన ప్రతిపక్షాలను బదనాం చేసే కుట్రలు చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ అన్నారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీ ఎన్నికల్లో మాట్లాడుతూ ఇకపై థర్మల్ పవర్ ప్లాంట్ పెట్టం, గ్రీన్ ఎనర్జీ ప్లాంట్ లు నెలకొల్పుతామని చెప్పారన్నారు. సీఎం మాట్లాడిన విషయంపై మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడితే రామగుండంలో హరీశ్‌రావు పవర్ ప్లాంట్ వద్దంటున్నారని అబద్ధపు మాటలు చెబుతూ దిష్టిబొమ్మ దహనం చేస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. దమ్ముంటే ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే మాజీ మంత్రి హరీశ్‌రావు అడిగిన వాటిపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అంతేకానీ మాజీ మంత్రిపై



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చందర్

ఇష్టం వచ్చినట్లు మాట్లాడతారా, ఖబడ్దార్ అంటూ హెచ్చరించారు. ఎన్టీపీసీ యాజమాన్యం ఒక యూనిట్‌కు రూ.4.7లకే ఇవ్వడానికి సిద్ధంగా ఉండగా, మంత్రివర్గ కేబినెట్ ఇచ్చిన డీపీఆర్ రూ.10,800కోట్ల ప్రకారం యూనిట్ కు రూ.7.4 పడుతుందని, అలాంటప్పుడు కమీషన్ల కోసమేనా థర్మల్ పవర్ ప్లాంట్లు అని మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారన్నారు. పంచాయతీ ఎన్నికల్లో లబ్ధి కోసం బీఆర్ఎస్‌పై అబద్ధపు ప్రచారం చేయడం మానుకోవాలని హితవుపలికారు. రామగుండంలో జరుగుతున్నది దౌర్జన్యం, అవినీతి, కూలగొట్టడం మాత్రమేనని ఆరోపించారు. ఆరు గ్యారంటీలను అటకెక్కించారని, 42శాతం బీసీ రిజర్వేషన్లు అంటూ బిల్లు పెట్టి, ఆర్డినెన్స్ తీసుకువచ్చి తీరా సర్పంచ్ ఎన్నికల్లో 17శాతమే ఇచ్చారన్నారు. ప్రతిపక్షాలు ధర్నాలు చేస్తే కేసులు పెట్టే పోలీసులు, అధికార పార్టీ నాయకులు మాజీ మంత్రి దిష్టి బొమ్మ దహనం చేస్తే ఎందుకు కేసులు పెట్టడం లేదని ప్రశ్నించారు. నాయకులు కౌశిక హరి, గోపు ఐలయ్య యాదవ్, బాదే అంజలి, గాదం విజయ, కల్వచర్ల కృష్ణవేణి, కవిత సరోజినీ, నూతి తిరుపతి, బుర్రి వెంకటేష్, నట్టు శ్రీనివాస్, కోడి రామకృష్ణ, కిరణ్ జీ, జక్కుల తిరుపతి, నిమ్మరాజుల సాగర్, తిమోతి, గుంపుల లక్ష్మి, గుర్రం పద్మ, కనకలక్ష్మి పాల్గొన్నారు.




## జాప్యం లేకుండా సీఎంపీఎఫ్ సేవలు



సమావేశంలో మాట్లాడుతున్న సీఎంపీఎఫ్ కమిషనర్లు

రామగిరి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): జాప్యం లేకుండా కోల్‌మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ సేవలను ఉద్యోగులకు అందించేందుకు కృషి చేస్తున్నామని సీఎంపీఎఫ్ రీజినల్ కమిషనర్లు హరిపచౌరి, గోవర్ధన్‌లు అన్నారు. మంగళవారం జీఎం కార్యాలయంలో అధికారులు, ఉద్యోగులతో ప్రయాస్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత సిడబ్ల్యూ ఏ ఉద్యోగుల రివైజ్డ్ పెన్షన్ పేమెంట్ 515 పిపిఓ ఆర్డర్స్‌ను పర్సనల్ అధికారి సుదర్శనంకు అందజేశారు. సీఎంపీఎఫ్ రీజినల్ కమిషనర్ హరిపచౌరి మాట్లాడుతూ లావాదేవీలు అన్నీ సి-కేర్స్ పోర్టల్ ద్వారా మాత్రమే జరుగుతున్నాయని, ఉద్యోగులు ఎలాంటి మధ్యవర్తులు లేకుండా సేవలను పారదర్శకంగా పొందవచ్చని తెలిపారు.

రివైజ్డ్ పెన్షన్ పై అవగాహన కల్పించారు. అధికారులు రాజేశం, రవిచంద్ర, భరత్, సిఎంపిఎఫ్ సిబ్బంది అనిత, మనోహర్, ప్రదీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌జీ-1లో జాతీయ కాలుష్య నివారణ దినోత్సవం



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సింగరేణి అధికారులు

గోదావరిఖని, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): జాతీయ కాలుష్య నివారణ దినోత్సవం సందర్భంగా పోల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో మంగళవారం ఆర్‌జీ-1 జీఎం కార్యాలయంలో ఎస్ఓటూ జీఎం చంద్రశేఖర్ అధికారులతో కలిసి వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ యేటా డిసెంబర్ 2న జాతీయ కాలుష్య నివారణ దినోత్సవం జరుపుకుంటామని, 1984డిసెంబర్ 2, 3 తేదీల్లో చోటు చేసుకున్న బోపాల్ గ్యాస్ దుర్ఘటనకు గుర్తుగా జరుపుతున్నామన్నారు. కాలుష్య నియంత్రణ మండలి సభ్యులు జేపీఎస్ చంద్రశేఖర్, డిప్యూటీ పర్సనల్ మేనేజర్ నాగుల వేణు, సీనియర్ పీఓలు శ్రావణ్ కుమార్, హన్మంతరావు, ఫిరోజ్ ఖాన్, పర్యావరణ పరిరక్షణ అధికారి వేణు, జూనియర్ ఎస్టేట్ అధికారి నీలేష్ పాల్గొన్నారు.

# వ్యర్థాల నుంచి కీలక ఖనిజాల వెలికితీతకు ఒప్పందం

గోదావరిఖని, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సింగరేణి వ్యాప్తంగా ఉన్న బొగ్గు మైనింగ్ వ్యర్థాల నుంచి రేర్ ఎర్త్ ఎలిమెంట్స్, ఇతర కీలక ఖనిజాలను అన్వేషించి, వాటిని వెలికి తీసేందుకు సీఎస్ఐఆర్- ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మినరల్స్ అండ్ మెటీరియల్స్ టెక్నాలజీ (ఐఎంఎంటీ)తో పని చేసేందుకు సింగరేణి ఒప్పందం చేసుకుంది. సింగరేణి ప్రాంతాల్లో షేల్, మట్టి, సాండ్ స్టోన్, గ్రానైట్ రాళ్లు, బొగ్గు ఫ్లై యాష్, బాటమ్ యాష్‌లలో ఉన్న కీలక ఖనిజాలను వెలికితీయనున్నారు. మంగళవారం సింగరేణి సీఎండీ ఎన్ బలరామ్ సమక్షంలో ఈ ప్రాజెక్టును లాంఛనంగా ప్రారంభించేందుకు ఇరుపక్షాలు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. కీలక ఖనిజ రంగంలో పరస్పర సహకారం కోసం ఈ ఏడాది జూన్‌లో తొలుత ఒక అవగాహన కుదుర్చుకున్నామని, తాజా ఒప్పందంతో ఈ ప్రాజెక్టు ప్రారంభానికి బలమైన



సీఎస్ఐఆర్- ఐఎంఎంటీ ప్రతినిధులతో ఒప్పందం చేసుకుంటున్న సింగరేణి సీఎండీ

ముందడుగు పడిందని సీఎండీ పేర్కొన్నారు.

సింగరేణి ఓపెన్ కాస్ట్ గనులలో కొన్నింటిలో రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ ఉన్నట్లు ప్రాథమికంగా నిర్ధారించామని, అలాగే సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం నుండి విద్యుత్ ఉత్పత్తి సందర్భంగా విడుదల అయ్యే ఫ్లై యాష్‌లో కూడా కనుగొనడం జరిగిందని పేర్కొన్నారు.

సింగరేణి ప్రాంతంలో లాంథనం, సీరియమ్, ప్రసియోడీమియం వంటి 6 రకాల లైట్ రేర్ ఎర్త్ ఎలిమెంట్స్, అలాగే ఇట్రియం, స్కాండియం, డిస్ప్రోజియం వంటి 8 రకాల హెవీ రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ ఉనికిని కనుగొన్నామన్నారు. వీటిపై ఐఎంఎంటి సంస్థ ద్వారా సర్వే జరుగుతుందని పేర్కొన్నారు. ఐఎంఎంటీ డైరెక్టర్ డాక్టర్ రామానుజ నారాయణ్ మాట్లాడుతూ పారిశ్రామిక వ్యర్థాల నుంచి క్రిటికల్ మినరల్స్ వెలికితీత, స్వదేశీ సాంకేతిక పద్ధతుల అభివృద్ధి ప్రధాన లక్ష్యమన్నారు. గ్రీన్ టెక్నాలజీకి అవసరమైన రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ , క్రిటికల్ మినరల్స్ భద్రత దిశగా ఇది గొప్ప ముందడుగు అన్నారు. ఒప్పంద పత్రాలపై సీఎస్ఐఆర్-ఐఎం ఎంటీ చీఫ్ సైంటిస్ట్, హైడ్రో ఎలక్ట్రో మెటలర్జీ శాఖ హెడ్ డాక్టర్ కాళీ సంజయ్, సింగరేణి సంస్థ నుండి డైరెక్టర్(పీపీ) వెంకటేశ్వర్లు సంతకాలు చేశారు. ఈడీ ఎస్‌టీపీపీ చిరంజీవి, జీఎం(కో ఆర్డినేషన్) టీ శ్రీనివాస్, జనరల్ మేనేజర్ ఎక్స్‌ప్లోరేషన్ బీ శ్రీనివాస్, జీఎం చింతల శ్రీనివాస్ పాల్గొన్నారు.

## సర్వే డిపార్ట్‌మెంట్ ఉద్యోగులకు పదోన్నతి పరీక్ష

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆర్జీ-2 ఏరియా సర్వే విభాగం ఉద్యోగుల పదోన్నతి నిమిత్తం మంగళవారం పరీక్షలు నిర్వహించింది. అసిస్టెంట్ చైన్‌మెన్, చైన్‌మెన్, హెడ్‌చైన్‌మెన్ పోస్టుల భర్తీకి ఎంవీటీసీలో జరిగిన పరీక్షలకు అర్హులైన ఉద్యోగులు పాల్గొన్నారు. ఆర్జీ-2 ఏరియా ఎస్వోటూ జీఎం రాముడు, డీజీఎం సర్వే ఉజ్వల్ బంధోపాధ్యాయ, సర్వే ఆఫీసర్ రవీందర్‌లు పరీక్షలను పర్యవేక్షించారు.